జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 07

ఏప్రిల్ 1-15, 2019





తూలుతున్న తెలుగు పల్లెలు - 2019 ఎన్నికలు

## వారసులు, బ్రహ్మచారులేనా మనకు నాయకులు?





లోక్‌సత్తా రూపొందించిన 'ప్రజల ఎజెండా'ను విస్తృతంగా ప్రచారం చేయండి: జేపీ



ఉగాది శుభాకాంక్షలతో....

NABH ACCREDITED

PATIENT SAFETY & QUALITY OF CARE

# శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

సాయిరామ్ వీధి, భవానినగర్, తిరుపతి - 517501.

✆ 0877-2287156, 2287437, 9849677970.

**అత్యవసర వైద్య సేవలు 24 గంటలు సీనియర్ డాక్టర్ల పర్యవేక్షణలో**

Fortis HOSPITAL

ఫోర్టిస్ హాస్పిటల్ వారు ఇప్పుడు రమాదేవి హాస్పిటల్ వారి సౌజన్యంతో తిరుపతిలో అత్యాధునిక వైద్య సదుపాయములతో, అనుభవజ్ఞులైన 16 మంది యూరాలజి డాక్టర్లచే యూరాలజి మరియు నెఫ్రాలజి వైద్యసేవలు

రాయలసీమలోనే మొట్టమొదటి లేజర్ మరియు రోబోటిక్ సర్జరీ వైద్యసేవలు కలిగిన ఏకైక హాస్పిటల్

## విభాగములు

- యాక్సిడెంట్ & ఎమర్జన్సీ
- న్యూరో సర్జరీ
- ఆర్థోపెడిక్ సర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ
- జనరల్ మెడిసిన్
- యూరాలజీ
- జనరల్ సర్జరీ
- నెఫ్రాలజీ
- డయాబెటాలజి
- గ్యాస్ట్రో ఎంట్రాలజీ
- చెవి, ముక్కు, గొంతు (ENT)
- బర్న్స్
- గర్భిణీ స్త్రీలు మరియు గర్భకోశవ్యాధులు

అత్యాధునిక పద్ధతి ద్వారా కోత, కుట్టు లేకుండా **లేజర్ మరియు ల్యాపరోస్కోపి** పద్ధతి ద్వారా ఆపరేషన్లు చేయబడును.

రాయలసీమలోనే అత్యంత అధునాతన 60 పడకల ICU

గవర్నమెంట్ ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు మెడికల్ రీయంబర్స్‌మెంట్ సౌకర్యము

బియ్యం కార్డు కలిగిన పేద ప్రజలకు పూర్తి ఉచితంగా ఈ క్రింది సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించబడును

- యాక్సిడెంట్ కేసులు
- ఫ్రాక్చర్ కేసులు
- ఆర్థోస్కోపి
- వెన్నెముక ఆపరేషన్లు
- విరిగిన ఎముకలు
- వంకర కాళ్ళు, కీళ్ళు
- టి.బి. మెనింజైటీస్
- తలలో రక్తం గడ్డకట్టడం
- పక్షవాతం
- జ్వరం, మలేరియా, డెంగ్యూ
- పోలియో కేసులు
- కాలిన గాయాలు
- ఎ.వి. ఫిస్టుల్లా
- అపెండిసైటిస్
- వేరికోస్వైన్స్
- డయాలసిస్
- కిడ్నీ, బ్లాడర్‌లో రాళ్ళు
- హెర్నియా సమస్యలు
- పాయిసన్ కేసులు
- పాముకాటు
- సూసైడ్ కేసులు
- మెదడులోని గడ్డలు
- వెన్నెముక వ్యాధులు
- వెంటిలేటర్ కేసులు
- ప్లాస్టిక్ సర్జరీ కేసులు
- మెదడు ఆపరేషన్లు
- తలకు తగిలిన గాయాలు
- బి.పి., షుగరు
- థైరాయిడ్ సమస్యలు
- అన్ని రకాల అత్యవసర కేసులు

ఈ క్రింద ఉన్న సంస్థల్లో పనిచేసే వారందరికీ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ మరియు మెడికల్ రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కలదు.

AAROGYASRI, EHS, AROGYA RAKSHA, ESI, RAILWAY, ECHS, INDIAN NAVY, AIRFORCE, INDIAN ARMY, AIRPORTS, IIT, IISER, POSTAL, APSPDCL, AP TRANSCO, APSRTC, NBPPL, AROGYA BHADRATHA, BSNL, AROGYA SAHAYATHA

అన్ని హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు పాలసీదారులకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్

24 HOURS EMERGENCY

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్


పక్షపత్రిక

ఏప్రిల్ 1-15, 2019 సంపుటి - 10 సంచిక - 07

## లోపలి పేజీల్లో...

లోక్‌సత్తా పార్టీ ఏపీ, తెలంగాణ నేతలకు.......... 5
వేలం పాటల్లా ఎన్నికలు.............................. 6
తూలుతున్న తెలుగు పల్లెలు-2019 ఎన్నికలు.... 7
ఐదు ఆస్ట్రేలియాల జనాభా లెక్కన కొత్త............ 9
30 కోట్ల మంది జనరేషన్ జెడ్ వచ్చేస్తున్నారు....... 10
ఇది కీలక దశ... నాయకత్వమే దిశ !............... 11
వారసులు, బ్రహ్మచారులేనా మనకు నాయకులు...13
ఎన్నికల్లో నల్లధనం మాటేమిటి?..................... 21
నోట్ల రద్దుపై చెబితే వింటేగా... చివరకు ............24
బదిలీలు ఏకపక్షమైతే.. అపశ్రుతి దొర్లినట్టే...........26
ఆటగాళ్లు కాదు... నియమాలు మారాలి !...........28
ప్రజామేధావి హెబర్‌మాస్..............................30
క్లారిటీతో కలసి పనిచేయటం నేర్చుకుంటే........ 33

## కార్టూన్ కార్నర్






తిరుగులేని మ్యానిఫెస్టో రాశాను సార్. ఎవరికీ సాధ్యం కాదు.

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA

## ప్రస్తుత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ వద్దు - స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వండి

# - లోక్‌సత్తా పార్టీ ఏపీ, తెలంగాణ నేతలకు జేపీ దిశానిర్దేశం -



ఏప్రిల్ 11న జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో, తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని, లోక్‌సత్తా పార్టీ రూపొందించిన ఎజెండాను ప్రచారం చేయాలని నేతలు, శ్రేణులకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిశానిర్దేశం చేశారు. త్వరలో తెలంగాణలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో, ఏపీలో జరగనున్న మునిసిపల్, పంచాయతీ ఎన్నికల్లో పోటీకి పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలని కోరారు.

**రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో పొత్తులు, మద్దతు గురించి నామినేషన్ల సమయంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర నాయకులతో జేపీ హైదరాబాద్ కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వారడిగిన ప్రశ్నలపై చర్చించారు.**




### లోక్‌సత్తా రూపొందించిన 'ప్రజల ఎజెండా'ను ప్రచారం చేయండి

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఎన్నికలు కేవలం అధికారం కోసం కొట్లాటగా మారాయి. డబ్బు, కులం, ప్రలోభ ఉచితాలు, కండబలం ప్రయోగించడంలో మాత్రమే పార్టీలు పోటీపడుతున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలు, విధానపరమైన అంశాలు చర్చలో లేకుండా పోయాయి. అందుకే లోక్‌సత్తా పార్టీ స్పష్టమైన, విధానపరమైన అంశాలతో 'ప్రజల ఎజెండా'ను రాష్ట్రవ్యాపితంగా చర్చకు పెట్టి తుదిరూపం ఇచ్చింది. ఈ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చెయ్యడం కంటే ప్రజల ఎజెండాను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల ఆలోచనలను ఆ దిశగా మళ్లించడం ముఖ్యమని భావించింది. ఈ అసెంబ్లీ ఎన్నికలలో పోటీకి దూరంగా ఉండాలని భావించింది. అయితే ఎన్నికల కాలంలో ప్రజల ఎజెండా ప్రచారాన్ని సాగించాలని నిర్ణయించింది" అని జేపీ తెలిపారు.

### మనకు ఎజెండా ప్రాణప్రదం..

### సాంప్రదాయ పార్టీలతో ఎన్నికల పొత్తుకు ప్రాతిపదిక లేదు

లోక్‌సత్తా పార్టీ ఎన్నికలకు శాశ్వతంగా దూరంకాదని, రాబోయే స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో పోటీకి పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని జేపీ స్పష్టం చేశారు. లోక్‌సత్తా పార్టీ కేవలం సీట్ల రాజకీయం కోసం రాలేదని, దానికి ఎజెండాయే ప్రాణప్రదమైందని, ఎప్పుడు ఎక్కడ పొత్తులు పెట్టుకున్నా అది ఉమ్మడి కనీస కార్యక్రమం ఆధారంగానే ఉంటుందితప్ప, సీట్ల చుట్టూ ఉండదని స్పష్టం చేశారు. అవినీతి, కేంద్రీకృత పాలన, ప్రలోభ ఉచితాల చుట్టూ తిరుగుతున్న సాంప్రదాయ పార్టీలతో ఎన్నికలకపొత్తుకు ప్రాతిపదిక లేదన్నారు. అధికార వికేంద్రీకరణ, బలమయిన ఫెడరల్ వ్యవస్థల కోసం జరిగే పోరాటంలో లోక్‌సత్తా కీలకపాత్ర వహించాలని జేపీ దిశానిర్దేశం చేశారు.

అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉన్నప్పటికీ రాబోయే మునిసిపల్, పంచాయతీ ఎన్నికలకు ఇప్పటి నుంచే నిర్మాణపరంగా చర్యలు చేపట్టాలని జేపీ కోరారు. అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ తీసుకున్న వైఖరికి భిన్నంగా ఎవరు, ఎలాంటి ప్రకటనలూ చేయకూడదని అన్నారు. అయితే లోక్‌సత్తా "ప్రజల ఎజెండా" పరిధిలో తమకు నచ్చినవారికి ఓటుహక్కును వినియోగించుకునే స్వేచ్ఛ పార్టీ సభ్యులకు ఉంటుందని, లోక్‌సత్తా అభిమానులు, మార్పును కోరుకునే ఇతర ప్రజానీకం కూడా ఈ ఎజెండా చుట్టూ ఓటు వేయాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ■



# వేలం పాటల్లా ఎన్నికలు

**రా**ష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్నవి ప్రజాస్వామిక ఎన్నికలు కాదని, వేలంపాటలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ నియోజకవర్గాలను, ఓట్లను వేలం పాటలో కొనుగోలు చేసే రాజకీయం చేస్తున్నారన్నారు. డబ్బు లేకపోతే ఎన్నికల్లో నిలబడి కనీస పోటీ కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విజయనగరంలో జరిగిన లోక్‌సత్తా పార్టీ జిల్లా నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎప్పుడో వందల ఏళ్ల క్రితం బ్రిటన్‌లో 'రాటెన్ బరోస్' (శిథిల నియోజకవర్గాలు) అని మాట్లాడుకునేవారని, ఆ నియోజకవర్గాలను, అందులోని ప్రజలను వేలం పాటలో అమ్మటం, కొనుగోలు చేయటం అప్పట్లో బహిరంగ రహస్యంగా ఉండేదని బాబ్జీ అన్నారు. ఆ తర్వాత కొందరు రాజనీతిజ్ఞులు సంస్కరణలు తెచ్చి ఆ పరిస్థితిని మార్చారన్నారు. బ్రిటన్‌లోని ఆనాటి అవలక్షణాన్ని మనం ఆధునికయుగంలో కొనసాగిస్తూ గొప్పదేశమని ప్రగల్భాలు పలుకుతున్నామన్నారు. పాతకాలం కాబట్టి కాస్త ఆలస్యంగా మారినా బ్రిటన్‌కు పెద్దనష్టం కలగలేదని, కానీ ఆధునిక యుగంలో మార్పు ఆలస్యమవుతున్నకొద్దీ భారతీయులకు తీవ్ర నష్టం జరుగుతుంటుందన్నారు. లోక్‌సత్తా రూపొందించిన 'ప్రజల ఎజెండాను' విస్తృతంగా ప్రచారం చేసేందుకు కృషి చేస్తున్నామని, వ్యక్తులు, పార్టీలకన్నా సరైన ఎజెండాను డిమాండ్ చేసి ఓట్లు వేయాలన్నారు. ఈ ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీ చేయకపోయినా, మంచి రాజకీయం వైపు ప్రజలను ప్రేరేపించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తుందన్నారు. దీర్ఘకాలంలో ముఖ్యమంత్రి ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా ఎన్నికల పద్ధతి కోసం కృషి చేస్తుందన్నారు. ఎటువంటి అధికారం లేకుండానే జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల సాధన సహా పలు విజయాల్ని లోక్‌సత్తా సాధించిందని పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల దామోదర్‌రావు అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు బి.టి రమణానందం, అయితంశెట్టి శ్రీనివాసరావు, నాగభూషణం, కాంద్రేగుల ఈశ్వరరావు, రాయి పద్మావతి, మూర్తి, పీఎల్‌ఎన్ రాజు, ప్రసాదు, సత్యం, పాపారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు. ■

# ఫిరాయింపులకు మూల్యం చెల్లించక తప్పదు



**ఫి**రాయింపులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. అధికార పార్టీలో ఉంటే తప్ప అభివృద్ధి చేయలేమనేవారు ఎన్నికల్లో పోటీ చేయటమే దండుగ అన్నారు. ప్రతిపక్షం లేకుండా చేయాలనుకునే ధోరణి చివరికి అధికార పక్షానికే నష్టదాయకంగా మారుతుందన్నారు. ప్రజాస్వామ్యం లేకపోతే ఎవరికీ మనుగడ ఉండదన్నారు. తెలంగాణలో భారీ మెజారిటీ వచ్చినా కూడా నిస్సిగ్గుగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న అధికార టీఆర్ఎస్ తీరుపై నాగోల్ రాక్‌హిల్స్ కాలనీలో ఆయన లోక్‌సత్తా నాయకులతో కలిసి మాట్లాడారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలతో తప్ప ఈ సంక్షోభాన్ని నిర్మూలించలేమని రాము అన్నారు. మార్పు కోరే వారు పటిష్టమైన ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా ఉన్న లోక్‌సత్తా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుండాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు సత్తెయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తూలుతున్న తెలుగు పల్లెలు - 2019 ఎన్నికలు

ఉపాధి పొందటమంటే.. కండబలాన్నో, బుద్రబలాన్నో ఉపయోగిస్తూ ఏదోక పనిచేసి డబ్బు సంపాదించటం కాదు. సమాజానికి ఉపయోగపడుతూ సంపాదించేదే ఉపాధి! అలా తమ సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేస్తూ యువ ప్రజానీకం ఉపాధి పొందే అవకాశాల్ని ప్రోత్సహించాల్సిన, పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ తెలుగునాట ప్రభుత్వాలు ఆ పనిచేయకపోగా ఖజానాకు ఆదాయమార్గంగా కూడా సమాజ వ్యతిరేక మార్గాన్ని అవలంబిస్తున్నాయి. ముఖ్యంగా పేద ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని చిదిమేసేలా మద్యాన్ని ఆదాయమార్గంగా ఎంచుకున్నాయి. అది కూడా తాత్కాలిక తాయిలాల్ని పంచేందుకు!



సమాజంలో పనిచేసే శక్తిలేని నిర్భాగ్యులకు ఉచితంగా ఇవ్వటంలో తప్పు లేదు. కానీ అందరికీ ఉచితంగా ఇవ్వాలనుకుంటే.. ప్రజలకు తాము చేయాల్సిన - నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన తదితర సేవలన్నింటినీ సక్రమంగా అందించాక ఇంకా ఆదాయం మిగిలితేనే ఆ పని చేయాలి. కానీ తెలంగాణ, ఏపీల్లో.. ఉన్న ఆదాయాన్ని ఓట్ల కోసం అవసరమున్నా లేకున్నా పథకాల పేరుతో పాలకులు పంపిణీ చేస్తున్నారు. ఉన్న ఆదాయం కూడా చాలక మద్యాన్ని ఆదాయమార్గంగా చేసుకుని తాగుడును విపరీతంగా ప్రోత్సహిస్తున్నారు.

తెలంగాణ ధనిక రాష్ట్రం కాబట్టి ఉచితాల పథకాలను అలవోకగా అమలుచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అనేకసార్లు చెప్పారు. అంత ధనిక రాష్ట్రమైతే మద్యం ద్వారా 20,000 కోట్ల ఆదాయం టార్గెట్ పెట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? అంతలా తాగుడును ఎందుకు ప్రోత్సహించాల్సి వచ్చింది? ఇంకాపైగా తాగుడు ద్వారా బ్రదర్స్ ఖజానాకు ఎంతో ఆదాయాన్నిస్తున్నారని కేసీఆర్ చమత్కారపు అభినందనలకటి!

రాష్ట్రం విడిపోయినా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏమీ భిన్నంగా లేదు. మద్యాంధ్రప్రదేశ్ బాటలోనే ప్రభుత్వం నడుస్తోంది. 2014లో తాను గెలిస్తే మొదటి సంతకం మద్యం బెల్టు దుకాణాల రద్దు ఫైలు మీదే పెడతానన్న చంద్రబాబు.. ముఖ్యమంత్రయ్యాక సంతకమైతే చేశారుగానీ అమలును మాత్రం పక్కదోవ పట్టించారు. మళ్లీ 2019 ఎన్నికలు సమీపించాక బెల్టు షాపుల మీద కొంత నియంత్రణ మొదలుపెట్టారుగానీ, క్షేత్రస్థాయిలో అధికారులే వాటికి పరోక్ష రక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత అవినీతిమయ విభాగంగా ఎక్సయిజ్ శాఖ రికార్డులకెక్కింది. ఎక్సయిజ్‌లో నిజాయతీపరులైన అధికారులను బదిలీ చేయాల్సిందేనని ఎమ్మెల్యేలు, జన్మభూమి కమిటీల నుంచి ముఖ్యమంత్రి స్థాయిలో కూడా పలుమార్లు ఒత్తిడిలు తెచ్చారు. ఒక ఉన్నతాధికారి బదిలీపై ఉద్యోగ సంఘాలు కూడా మౌనం వహిస్తే, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ స్వయంగా బహిరంగంగా గళం విప్పాల్సి వచ్చింది. తాగుడు వ్యసనాన్ని మాన్పించటానికి నవోదయం పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించినా, అది కూడా ఒకరోజు వార్తల జాబితాలో చేరిపోయింది.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి సంవత్సరం మద్యం టార్గెట్ 10శాతం పెరిగేది. ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోయినాక మద్యం అమ్మకాల టార్గెట్‌ను ప్రభుత్వాలు ఏటా 20-50శాతం పెంచుకుంటూ పోతున్నవి. 2014-15 కాలానికి తెలంగాణలో మద్యం అమ్మకాలు రూ.10,238.78 కోట్లు అయితే, 2017-18 సంవత్సరానికి అవి రూ.17,597 కోట్లకు చేరాయి. భారతదేశం మొత్తం మీద మద్యం ప్రధాన ఆదాయవనరుగా మిగులుతున్న రాష్ట్రాలు తెలుగు రాష్ట్రాలే అవుతుండటం దురదృష్టకరం. టార్గెట్లు పెంచడమే తప్ప తగ్గించే ధోరణులు ఎక్కడా లేవు.

ఈవేళ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మద్యం ద్వారా రూ.40,000 కోట్ల పైచిలుకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అనధికార అమ్మకాల్ని కూడా గణిస్తే ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. ఈ లెక్కన ప్రజలు రూ.50,000 కోట్లపైనే రెండు రాష్ట్రాల్లో మద్యం మీద జేబుల్లో నుంచి వెచ్చిస్తున్నారు. 2017-18లో వచ్చిన ఓ అధ్యయనం ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లో 37 శాతం తాగుడుకి అలవాటు పడ్డారు. ఆ తర్వాత వచ్చిన మరో నివేదిక ప్రకారం, దక్షిణ భారతదేశంలోనే వేగంగా మద్యం వ్యసనం పెరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటిస్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉంది.

మద్యం తాగటమేమీ నైతికమైన అంశం కాదు. మద్యం తాగినవాడు దుర్మార్గుడు కాదు, తాగనివాడు మహాత్మాగాంధీ కాదు. కానీ మద్యం అలవాటు వల్ల పేదలు బాగా నష్టపోతున్నారు. ఉపాధి హామీ పథకం, కూలీ రేట్లు పెంపు, ఇతర మార్గాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఆదాయంలో చాలా భాగం మద్యానికే పోతోంది. తెలుగు పల్లెల్లో సమస్యల మీద చర్చించటానికి జరిపే సమావేశాల్లో జనం కనిపించటంలేదుగానీ, మద్యం దుకాణాల దగ్గర మాత్రం నిత్యం రద్దీయే. ఓ చిన్న గ్రామపంచాయతీ పరిధిలోని (అధికారిక) మద్యం దుకాణంలో కూడా రోజుకు రూ.50,000 దాకా అమ్మకాలుంటున్నాయి. దీనివల్ల ఎంత సంపాదించినా వృథా కావటం, ఆరోగ్యం దెబ్బతినటం, మహిళలు గృహహింసకు గురికావటం, ఇంట్లో పిల్లలకు సరైన బాల్యం కొరవడటం తదితర సమస్యలు ప్రబలుతున్నాయి. తాగి వాహనాలు నడపటం, స్మార్ట్‌ఫోన్‌తో ఊహాప్రపంచానికి పరిమితమవడం మద్యపాన దుష్పరిణామాలను ఇంకా పెంచుతున్నాయి. 35 సంవత్సరాలలోపున్న వితంతువుల సంఖ్య విపరీతంగా పెరగడానికి మద్యపాన మరణాలే కారణం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ 2016 ప్రాంతంలో ఇచ్చిన నివేదికల ప్రకారం ప్రతి 96 నిముషాలకు ఒక భారతీయుడు మద్యపాన దురలవాటుతో మరణిస్తున్నాడు. భారతదేశంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో సుమారు 70శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయి. భారత్‌లో ఏటా జరుగుతున్న మరణాలలో 12శాతం అధిక మద్యపానం వలన, సంబంధిత రోగాల వలన సంభవిస్తున్నవే. ప్రపంచ ప్రజల సరాసరి మద్యపాన సేవన సంవత్సరానికి 6.2 లీటర్లు అయితే.. తెలుగు ప్రజల, ముఖ్యంగా గ్రామీణ ప్రజలు సరాసరి సేవించే మద్యపానం సంవత్సరానికి తలకు 12 లీటర్లు. సగటున 30శాతం మంది భారతీయులు మద్యం సేవిస్తుంటే అందులో 11శాతం మద్యానికి బానిసలైపోయారు. 1992-2012 మధ్యకాలంలో మద్యపానం చేసే భారతీయుల సంఖ్య 55శాతం పెరిగింది. ముఖ్యంగా ఈ పెరుగుదల యువతలో ఎక్కువగా ఉన్నది. 2012 సంవత్సరం నాటికి 3.3 మిలియన్ల భారతీయులు మద్యపానం/సంబంధిత రోగాల వలన చనిపోయారు. మద్యపానం వలన సగటు భారతీయుల ఆయుషు 4 సంవత్సరాలు తగ్గిపోయింది. కుటుంబ పెద్దలు మద్యానికి బానిసలు అవుతున్న సంఖ్య ప్రపంచ దేశాలలో కంటే భారతదేశంలో 10శాతం ఎక్కువగా ఉన్నది. భారత్‌లో నిరుపేదలు పెరగడానికి ఇదీ ఒక పెద్ద కారణం.

2011-12 లెక్కల ప్రకారం భారతదేశంలో మద్యం తాగే వారి లెక్కలు చూస్తే తెలుగు రాష్ట్రాల ప్రజలు సరాసరి వారానికి 561 మిల్లీలీటర్ల కల్లు/గుడుంబా తాగుతున్నారు. అదేవిధంగా 532 మిల్లీలీటర్ల బీర్/ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ తాగుతున్నారు. భారత్‌లో ఒక్క అరుణాచల్ ప్రదేశ్ మినహా మరే రాష్ట్రం ఈ సగటుకు దరిదాపుల్లో కూడా లేదు. దేశంలోనే తెలుగువారు ముందంజలో ఉన్నారని గర్వపడదామా?.. ప్రపంచంలో అత్యధికంగా మద్యాన్ని సేవించే దేశాలలో మనది 3వ స్థానం. భారతదేశ గ్రామీణ యువకుల్లో 29శాతం మద్యానికి అలవాటు పడిపోయినట్లు, గత 10 సంవత్సరాల కాలంలో మద్యానికి అలవాటుపడుతున్న 15సంవత్సరాలలోపు బాలల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నదని నివేదికలు ఘోషిస్తున్నాయి. మద్యపానం వలన వివిధ రకాల లివర్, మౌత్, ఓరోఫారింక్స్, బ్రెస్ట్ కేన్సర్ల సంఖ్య పెరిగిపోతోందని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో మద్యపాన సంబంధిత 'ఆల్కొహాలిక్ హైపో గ్లైకేమియా' వ్యాధితో చనిపోతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది.

ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న, ఆడపడుచుల ఉసురు పోసుకుంటున్న మద్యాన్ని ఆదాయమార్గం చేసుకుని ఆ డబ్బుతో ఆరోగ్యశ్రీలు, పింఛన్లు, కల్యాణలక్ష్మి, పసుపు-కుంకుమ వంటి స్కీముల్ని అమలు చేస్తారా? పైగా ఈ పాలన దేశానికి ఆదర్శమని, జాతీయస్థాయికి తీసుకెళ్తామని ఇద్దరు చంద్రులూ బాకాలు ఊదుకోవటం! మన చెబుతున్న ఆదర్శాలకి, చేస్తున్న పాలనకి ఏమైనా సంబంధం ఉందా? ప్రతిపక్షాలు కూడా మద్యం మహమ్మారిపై గొంతు తగ్గించటం, స్పష్టమైన పరిష్కారాన్ని డిమాండ్ చేయకపోవటం దురదృష్టకరం.

ముఖ్యంగా మద్యం అందుబాటులో ఉండటం, ఎన్నికలు, ఇతరత్రా కార్యక్రమాల సమయంలో మద్యాన్ని పంచటం వల్ల ఈ అలవాటు పెరుగుతోంది. మద్యాన్ని నిషేధించటం సరైన నిర్ణయం కాదు. దానివల్ల మాఫియాలు పెరిగే అవకాశముంది, పైగా అదేమీ నైతికమైన అంశం కాదు. అందుకే దశలవారీగా మద్యనిషేధం అమలు చేస్తామన్న వైకాపా హామీ మీద ఆశలు పెట్టుకోనక్కర్లేదు. అయితే, ఇంతకుముందే చెప్పుకున్నట్లు పేదలు మద్యం బారిన పడి నాశనం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థ మీద ఉంది. ఇందుకోసం, మద్యాన్ని అందుబాటులో లేకుండా చేయాలి. ఈ నేపథ్యంలోనే, 2019 ఎన్నికలకు లోక్‌సత్తా పార్టీ రూపొందించి విడుదల చేసిన 'ప్రజల ఎజెండా'లో గ్రామాల్లో మద్యాన్ని పూర్తిగా నిషేధించి, అమలు బాధ్యతను పంచాయతీలకు అప్పగించాలని ప్రతిపాదించింది.

మద్యాన్ని ఆదాయమార్గంగా చేస్తున్న ప్రభుత్వాల, రాజకీయ పార్టీల విధానాలను పూర్తిగా తిరస్కరిద్దాం. 'కఠిన మద్యనియంత్రణ విధానాన్ని అమలు చేసి గ్రామాలను మద్యరహితం' చేయాలన్న లోక్‌సత్తా ప్రతిపాదనను ఎన్నికల డిమాండ్‌గా మార్చుకుందాం. ■

(ఇన్‌పుట్స్: చంద్రుపట్ల రమణ కుమార్ రెడ్డి, న్యాయవాది)



# ఐదు ఆస్ట్రేలియాల జనాభా లెక్కన కొత్త ఉద్యోగాల్ని సృష్టించాలి

దేశంలో యువశక్తి పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే దశాబ్దకాలంలో భారత్ దాదాపు 10 కోట్ల కొత్త ఉద్యోగాలను కల్పించాల్సిన అవసరముందని పీడబ్ల్యూసీ స్ట్రాటజీ నివేదిక పేర్కొంది. దీనివల్ల దేశ వృద్ధి రేటు మరింత పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపింది. జిల్లాల్లోని స్థానిక వనరులను మార్కెట్లకు అనుసంధానం చేయడం ద్వారా పెద్దఎత్తున ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందని పేర్కొంది. వచ్చే దశాబ్దకాలంలో ఐదు ఆస్ట్రేలియాల జనాభాకు సమానమైన ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఇది దేశం ఎదుర్కొంటున్న చాలా క్లిష్టమైన అంశాల్లో ఒకటని వ్యాఖ్యానించింది. ఇలాంటి సవాలును ముందుచూపుతోపాటు సమర్థవంతంగా అధిగమిస్తేనే దేశ వృద్ధిని పెంచటానికి, సమ్మిళిత పరచటానికి అవకాశం ఉంటుందని సూచించింది. దేశంలో మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించి దేశ కార్మికశక్తిలో భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్)ను పెంచాల్సిన అవసరముందని తెలిపింది.

## యువతా మేలుకో!

*పలుకని రాతిదేవుళ్ళకు*
*లక్షలు ఖరీదు చేసే గుళ్ళు*
*పలికే ప్రజాస్వామ్య దేవుళ్ళకు గతిలేవు సరైన కొలువులు, గూళ్ళు*
*ఇది ఏ దేవుడి సృష్టిరా*
*ఇది ఏ నరుడి దృష్టిరా!*

*కులం లేదు మతం లేదు*
*జాతి నీతి ఒక్కటేనని*
*పుష్టిలేని ఎంగిలి మెతుకులతో ఎండిన*
*డొక్కను ఢమరం చేసి*
*సమ సమతా సమరం ఉందంటూ*
*రమ్మంటున్నాను నా తరాన్ని*
*నవనవోన్మేష నవ విప్లవ యువతరాన్ని!* ■

**- మొహమ్మద్ ముంతాజ్ ఖాన్,**
బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్

# 30 కోట్ల మంది జనరేషన్ జెడ్ వచ్చేస్తున్నారు.. వీరందరికీ ఉద్యోగాలు ఎలా సృష్టిస్తారు?



దేశంలో నిరుద్యోగ సవాలు ఉన్నకొద్దీ తీవ్రతరమవుతోందని భారత పరిశ్రమ వర్గాలు, అధ్యయనాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

ప్రైవేటు రంగం నుంచి కొత్త పెట్టుబడులు రావడం లేదని, గిరాకీ తగ్గిపోవటం, తయారీరంగం అంతంతమాత్రంగా ఉండటం నిరుద్యోగం పెరుగుతూండడానికి నేపథ్యమని సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) తెలిపింది.

మరోవైపు, దేశ ఆర్థిక వృద్ధిలో మందగమనం ఆడ, మగ తేడాలేకుండా ప్రజల్లో ఆందోళనను పెంచుతోందని ఎస్ అండ్ పీ నివేదిక వెల్లడించింది. ఆర్థిక భవిష్యత్తుపై మహిళల్లో 83 శాతం బాధపడుతుండగా, పురుషుల్లో 87 శాతం మథనపడుతున్నారని తెలిపింది. అయితే 35 శాతం మహిళలు మాత్రం భవిష్యత్తుపై తీవ్రంగా కలత చెందుతున్నారు. ఈ స్థాయిలో మరే దేశంలోనూ మహిళలు బాధపడటం లేదని వ్యాఖ్యానించింది. అయితే మహిళలు ఇలా బాధపడటానికి ఇంకా ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాన్ని మాత్రం నివేదిక ప్రస్తావించలేదు.

పురుషులు, మహిళలను అత్యధిక ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తున్న అంశాల్లో.. ఉద్యోగాలు–ఆర్థిక వ్యవస్థ వాటా 25 శాతం ఉండగా, ఆర్థిక వనరులతోనే ముడిపిన విద్య 24 శాతం, ఆరోగ్య సంరక్షణ 21 శాతం ఉన్నట్లు నివేదికలో తేటతెల్లమైంది. ఆర్థికవృద్ధి, స్టాక్‌మార్కెట్లు, ఊహించని అనారోగ్యాలు తమ ఆర్థిక స్థితిని తమ అధీనంలో లేకుండా చేస్తున్నాయని 32 శాతం మంది అభిప్రాయపడ్డారు.

**తగ్గిపోతున్న మహిళా శ్రామికుల సంఖ్య**

దేశంలో మహిళా శ్రామికుల సంఖ్య గత దశాబ్దిలో గణనీయంగా పడిపోయిందని డెలాయిట్ అనే సంస్థ చేసిన అధ్యయనం వెల్లడించింది. దీని ప్రకారం, 2005లో 36.7 శాతం ఉన్న మహిళా శ్రామికుల సంఖ్య 2018 నాటికి 26 శాతానికి పడిపోయింది. 13 ఏళ్లలో సుమారు 10 శాతానికిపైగా మహిళా శ్రామికులు తగ్గిపోయారు. అసంఘటిత రంగంలో ప్రస్తుతం 19.5 కోట్ల మంది మహిళలు పనిచేస్తున్నట్లు అంచనా. నాణ్యమైన విద్య, నైపుణ్యాల లేమి, సామాజిక అడ్డంకుల వల్లే మహిళలు అసంఘటిత రంగ శ్రామికులుగా మారుతున్నారని నివేదిక తెలిపింది. ఈ అవరోధాలే మహిళల ఆర్థిక వెనుకబాటుతనానికి కారణాలని పేర్కొన్నది.

ప్రస్తుత సంక్షోభం ఇలా ఉంటే, దశాబ్దకాలం తర్వాత ముంచుకురానున్న మరో పెనుసవాలు గురించి కూడా సీఐఐ హెచ్చరించింది. ప్రస్తుతం భారత్‌లో 6–16 ఏళ్ల మధ్య 30 కోట్ల మంది చిన్నారులున్నారని, పదేళ్ల తర్వాత ఈ జనరేషన్ జెడ్‌కు ఉద్యోగాలు సృష్టించటం మరో పెద్దసవాలని తెలిపింది.


'ఇప్పటి నుంచే మనం జాగ్రత్తపడాలి. పాఠశాల స్థాయి నుంచే వృత్తివిద్యా శిక్షణను ప్రారంభిస్తేనే ఉపాధిని అందించగలం. సాంకేతికత వేగంగా పెరుగుతోంది. వచ్చే అయిదేళ్లలో అది మరింత మందికి ఉద్యోగాలు లేకుండా చేసే అవకాశముంది. పరిశ్రమ వర్గాలు, విద్యాసంస్థలు కలిసి భవిష్యత్ కోసం ప్రణాళికను రచించాల్సిన అవసరం ఉంది' అని సీఐఐ వర్గాలు పేర్కొన్నాయి. ■

# ఇది కీలక దశ.. నాయకత్వమే దిశ!

## బాగా పనిచేస్తే పదేళ్లలో అగ్రస్థానంలో ఆంధ్ర.. రాష్ట్రానికి దార్శనికుడు కావాలి

**–'ఆంధ్రజ్యోతి' ముఖాముఖిలో జయప్రకాష్ నారాయణ్–**

*అవినీతిరహిత రాజకీయాల కోసం కలలు కన్న స్వాప్నికుడు.. పాలనలో సంస్కరణల కోసం కృషి చేసిన శ్రామికుడు.. సమాజంలో మార్పు కోసం అత్యున్నత ప్రభుత్వ పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసిన నిజమైన నాయకుడు.. రెండు దశాబ్దాల నుంచి పౌరుల హక్కుల కోసం పాటుపడుతున్న ప్రజాస్వామ్య నావికుడు.. ఆయనే లోక్‌సత్తా సారథి, మాజీ ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి, రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆయన తన ఆలోచనలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.*



**ఈ ఐదేళ్లలో రాష్ట్ర పురోగతి ఎలా ఉంది?**

తగినన్ని ఆర్థిక వనరులు లేకున్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపినందుకు ముఖ్యమంత్రిని, శాసనసభను అభినందించాలి. ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు వేగంగా పూర్తవుతోంది. కియ వంటి అంతర్జాతీయ కంపెనీల కార్యకలాపాలు మొదలయ్యాయి. మరెన్నో బడా సంస్థలు ఆంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. అయితే అధికార వికేంద్రీకరణ జరగకపోవడం, అవినీతి పెరిగిపోవడం, రాజకీయాల్లో ధనప్రాబల్యం పెరిగిపోవడం తెలుగు రాష్ట్రాలకు పెనుశాపంగా మారాయి.

**దక్షిణాది రాష్ట్రాలతో పోటీపడాలంటే..?**

2013–14లో ఆంధ్రలో తలసరి ఆదాయం రూ. 80వేలు ఉండేది. ఇప్పుడు 1.40 లక్షలకు పెరిగింది. తెలంగాణ ప్రస్తుత తలసరి ఆదాయం 1.80 లక్షలు. ఏపీలో వ్యవసాయం ద్వారా ఆదాయం పొందేవారు 32 శాతం ఉండగా, తెలంగాణలో 15 శాతం ఉన్నారు. సేవారంగం బలహీనంగా ఉండటం,

## ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఎన్నికలు ఎంత కీలకం?

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చి మోదీ అధికారంలోకి వచ్చారు. ఆ హామీని నిలుపుకోలేకపోయారు. పైగా రాష్ట్రాలపై కర్రపెత్తనం చేస్తున్నారు. విభజన నేపథ్యంలో యూనియన్ ప్రభుత్వం నుంచి ఏపీకి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల వివరాల్ని ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా చొరవతో స్వతంత్ర నిపుణుల బృందం నివేదికగా ఇచ్చింది. తెలుగేతర జాతీయ స్థాయి నిపుణులు కూడా ఈ నివేదికను ధృవీకరించారు. పొరుగు రాష్ట్రాలకు సమస్యలు లేకుండా ఏపీకి ఎలా ఈ నిధుల్ని అందించవచ్చో నివేదికలో వివరించాం. రాష్ట్రాలు తమ హక్కుల సాధన కోసం అవసరమైతే కేంద్రంతో న్యాయపోరాటం చేయాలి. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. అందుకే ఆంధ్రకు ఇది ఎంతో కీలకమైన దశ.

వ్యవసాయ రంగం వాటా ఎక్కువ ఉండటం – ఈ రెండూ ఒక ఆధునిక ఆర్థిక వ్యవస్థ బలహీనతని, వెనుకబాటుతనాన్ని సూచిస్తాయి.

**హైదరాబాద్ స్థాయి నగరం లేదు గదా?**

ఆర్థిక పురోగతికి నగరాలు కేంద్ర బిందువులు. అమరావతితోపాటు విశాఖపట్నం, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం నగరాలనూ అభివృద్ధి చేయాలి.

**వలసెళ్లినవారు తిరిగొచ్చే సమయమిదేనా?**

మెరుగైన అవకాశాల కోసం వేరే ప్రాంతాలు, దేశాలకు వెళ్లడం సహజం. ప్రస్తుతం ఏపీలో ఒడిషా, బీహార్‌కు చెందిన యువత ఉపాధి పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అపార మానవ వనరులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే యువతకు అద్భుత అవకాశాలు వస్తాయి.

**రాష్ట్రానికి ఎలాంటి నాయకత్వం కావాలి?**

దూరదృష్టితో, దీర్ఘకాలిక వ్యూహంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలిగే నాయకత్వం అవసరం. పెట్టుబడుల్ని ఆకర్షించే రీతిలో ప్రణాళికలు రూపొందించే సామర్థ్యం ఉన్న దార్శనికుడు కావాలి.

**కేంద్రం అండ ఉంటే ప్రగతి ఎలా ఉండేది?**

కేంద్రం నుంచి నామమాత్రంగానే నిధులు అందాయి. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులన్నింటినీ కేంద్రం ఇవ్వాల్సిన అవసరం లేదు. కేంద్రం ఒక రాష్ట్రంపై కక్షతో వ్యవహరించడం భావ్యం కాదు. రాష్ట్రాలు బాగుంటేనే దేశం బాగుంటుంది.

**పోలవరం ఏపీకి వరమేనా?**

పోలవరం ఓ అద్భుతం. వృథాగా పోతున్న గోదావరి నీటిని ఒడిసిపట్టుకోవడం వల్ల ఆంధ్రకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పోలవరం పూర్తయితే రాయలసీమకు నీరందించే వీలుంటుంది. ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సస్యశ్యామలం అవుతుంది.

**అమరావతి నిర్మాణం ఎలా సాగుతోంది?**

కొంత ఆలస్యమైనా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాజధాని నిర్మాణం జరగాలి. ఢిల్లీ సాయం అందితే నిర్మాణం మరింత వేగంగా పూర్తవుతుంది.

**రాజకీయ వాతావరణం ఎలా ఉంది?**

ఏపీ, తెలంగాణల్లోనేకాదు, దేశవ్యాప్తంగా రాజకీయాల్లో అధికారమే పరమావధిగా మారింది. విలువలు, సిద్ధాంతాలు లేవు. అధికారం కోసం ఎంతకైనా తెగించే ప్రస్తుత పరిస్థితిని చూస్తే సిగ్గుగా ఉంది. ఈ పరిస్థితుల్లో మేధావులు మౌనం వీడి, ప్రజలను చైతన్యపరిస్తేనే సమాజానికి మేలు జరుగుతుంది. ■



# వారసులు, బ్రహ్మచారులేనా మనకు నాయకులు?

**2019**లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు భారతదేశంలోని కొన్ని ప్రధాన సాంస్కృతిక, సాంప్రదాయ ధోరణులకు అద్దం పడుతున్నాయి.

అందులో బాగా చెప్పుకోవలసినది.. కుటుంబ వ్యవస్థకు, సన్యాసి జీవనానికి మనం అనాదిగా ఇస్తున్న గౌరవానికి రాజకీయ పట్టం గట్టటం.

సన్యాసి అంటే ఇల్లు వదిలేసి వెళ్లినా, ఇంట్లోనో ఉంటున్నా .. పెళ్లి బాదరబందీలేని (పేరుకి పెళ్లి చేసుకున్నా సంసారం చేయకుండా విడిపోయి ఒంటరిగానే ఉంటున్న) బ్రహ్మచారి అనే అర్థానికే ఇక్కడ పరిమితమవుదాం.

బ్రహ్మచారి గారి బ్రహ్మచర్యం నేతిబీరకాయలోని నెయ్యే అయినా సరే.. బ్రహ్మచారి బ్రహ్మచారే అని ఆమోదిద్దాం.

నిజానికి కుటుంబ జీవనం, సన్యాస జీవనం రెండూ భిన్న ధృవాలు. కానీ ఈ రెంటినీ ఏకకాలంలో కలిపి భారతీయ సంప్రదాయంలో భాగం చేశారు కాబట్టి.. మనం కూడా ఎటువంటి తడబాటూ లేకుండా రెంటినీ కలగలిపి ఈ ఎన్నికల్లో రహస్య ఓటు ద్వారా మన ప్రతినిధులుగా ఎన్నుకుంటున్నాం.

కుటుంబ వ్యవస్థ అంటే మహిళలను అణచివేస్తూ ఆస్తులను కాపాడుకునేందుకు పురుషులు ఏర్పాటు చేసిన వ్యవస్థ అని కొందరు ఆలోచనాపరుల విమర్శ. మహిళ, వారసత్వం లేకపోతే సొంత ఆస్తికి అర్థం, దాచుకోవటానికి అవకాశం తక్కువ కాబట్టి.. కుటుంబ వ్యవస్థను సృష్టించి బలోపేతం చేస్తూ వచ్చారని, రక్షణ, పోషణ దృష్ట్యా ఇది స్త్రీలకు కూడా అనుకూలంగా ఉండటంతో వారి సహకారం కూడా లభించిందని వారంటారు. ఈ వాదనను తప్పు పట్టాల్సిందేమీ లేదు. ఇది లోతైన విమర్శే. కానీ అదే సమయంలో, వ్యక్తిగత స్వార్థం, లైంగిక చర్యలు లాంటి మానవ సహజాతాలకు చోటు కల్పిస్తూ మానవాళి వృద్ధికి ఒక క్రమపద్ధతిలో దోహదం చేసే కుటుంబ వ్యవస్థ ఏర్పాటును కూడా అర్థరహితమంటూ వ్యతిరేకించనక్కర్లేదు. నిజానికి కుటుంబ వ్యవస్థ లేకపోతే

మనదేశంలో చట్టబద్ధపాలన అనేదే కనిపించకుండా అరాచక పరిస్థితులు నెలకొని ఉండేవి.

ఆధునిక ప్రజాస్వామిక ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యత– చట్టబద్ధపాలన. కానీ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తూ ప్రజలకు భద్రత కల్పించటంలో పూర్వపు రాచరిక ప్రభుత్వాల స్థాయిలో కూడా మనదేశంలో పాలకులు వ్యవహరించ లేకపోతున్నారు. ఈ అరాచకం నుంచి మనల్ని కాపాడుతున్నది ప్రధానంగా మన కుటుంబ వ్యవస్థ, దాని చుట్టూ సమాజంలో పెంపొందించిన కొన్ని కట్టుబాట్లు!

చట్టబద్ధపాలనలో మనకు నూటికి కనీసం 50–60 మార్కులు వస్తున్నాయంటే, అందుకు మన కుటుంబ వ్యవస్థే ప్రధాన కారణం. కేవలం మన పాలకులకైతే ఇందులో 20 మార్కులు కూడా రావు. ఇంకోపక్క, పోటీ ప్రపంచంలో విస్తరిస్తున్న మానసిక సమస్యలకు కూడా కుటుంబ వ్యవస్థ ఓ పెద్దపరిష్కారంగా కొనసాగుతోంది. కుటుంబం పట్టించుకోకుండా ప్రతి పౌరుని గురించీ సమాజమే పట్టించుకోవాలంటే, మనదేశం భరించలేని భారాలతో కుంగిపోయేది. ఇలాంటి సానుకూలతలు ఒక పక్క ఉండగా, కుటుంబ వ్యవస్థకు మరోవైపు ప్రతికూలతలు కూడా ఉన్నాయి. మహిళల అణచివేత, మితిమీరిన బాంధవ్య భారాలతో వ్యక్తిత్వపరమైన సమస్యలు పెరగటం, వంశపారంపర్యం పేరుతో వికృత ధోరణులు వంటివి ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం మనం వంశపారంపర్యం గురించి మాట్లాడుకుంటున్నాం.

కేవలం ఫలానా తల్లి గర్భాన పుట్టాడు కాబట్టి మన భారతీయ కుటుంబ వ్యవస్థలో ఒక బిడ్డకి అపార సంపదలు వారసత్వంగా వచ్చి పడతాయి. అదేరకంగా వ్యాపారాల్లో, ఇతర పలు రంగాల్లో కొడుకులు, కూతుళ్లు ఏమీ చేయకుండానే అప్పనంగా అవకాశాలు అరచేతిలో వచ్చిపడతాయి. వీటన్నిటినీ మించి, ప్రజాస్వామ్యానికి, జనజీవితాలకూ మూలమైన రాజకీయాల్లో తండ్రికి లేదా తక్కువ సందర్భాల్లోనైనా తల్లికి పదవి ఉంటే, వారి పిల్లలు కూడా వారసులుగా వచ్చేస్తారు. బలమైన కుటుంబ వ్యవస్థ ఇలా భారతదేశంపై చూపుతున్న తీవ్ర ప్రతికూల ప్రభావం– రాజకీయాల్లో నేతల వారసులు వెల్లువెత్తటం.

"ఇది తప్పేమీ కాదు, తండ్రి వారసత్వంతో కొడుకు వ్యాపారంలోనే కాదు రాజకీయాల్లోకి కూడా ప్రవేశించటం మన సంప్రదాయం. ఏ రంగంలోనైనా సమర్థులైతేనే వారసులుగా విజయవంతమవుతారు" అని ఇటీవల తన కుమారుడు లోకేష్ రాజకీయ కార్యాచరణ గురించి వ్యాఖ్యానిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

కానీ చంద్రబాబు చెప్పింది పూర్తిగా ప్రజాస్వామ్య రాజకీయానికి వక్ర భాష్యం.

కొడుకులకు, కూతుళ్లకు వారసత్వంగా ఇవ్వాల్సింది మంచి చదువులు, ఆరోగ్యం, సరైన సమాజం వంటివేగానీ రాజకీయ పదవులు కాదు! ఒకవేళ నేతల వారసులు సమర్థులే అనుకున్నా.. సమాజంలో వారి కంటే సమర్థులు లేరా? కనీసం సామాన్య, మధ్యతరగతిలో వారి స్థాయిలోని సమర్థులకు వారిలా అవకాశాలు వస్తున్నాయా?

కాబట్టి, వారసత్వ రాజకీయాలనేవి అప్రజాస్వామికం, మన ప్రజాస్వామ్యాన్ని పీడిస్తున్న పెద్ద జాడ్యం. అది ఈ ఎన్నికల్లో మరింత పేట్రేగింది.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏకపక్ష వ్యవహారశైలిని జాతీయస్థాయిలో ఎదుర్కోవటం సాధ్యమయ్యేలా కన్పించకపోవటంతో, ప్రాంతీయంగా ఎదుర్కోవటం ఈ ఎన్నికల్లో ఒక వ్యూహంగా మారింది. రానున్న కాలంలో ప్రాంతీయ పార్టీలు జాతీయస్థాయిలో కూడా ప్రభావం చూపించే దశ మళ్లీ ప్రారంభమవుతున్నట్లు కనిపిస్తోంది. ప్రాంతీయ పార్టీలలో సాధారణ లక్షణంగా కొనసాగుతున్న ఏకవ్యక్తి నాయకత్వం, వంశపారంపర్య రాజకీయాలకు మరింత ఊపునిచ్చేలా ప్రస్తుత ఎన్నికల క్షేత్రం రూపుదిద్దుకుంది.

తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే, ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి చంద్రబాబు నాయుడు గెలిస్తే, లోకేష్‌ను ముఖ్యమంత్రి చేస్తారని అంచనాలు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు కుమారుడు కె. తారక రామారావు కంటే లోకేష్ మెరుగ్గా పనిచేశారని, అయితే కేటీఆర్‌లా ఆయనకు వాక్చాతుర్యంలేక వెనుకబడ్డారని టీడీపీ వారి వాదన. టెక్నాలజీలో లోకేష్ స్పీడ్‌ను దెబ్బతీసేందుకు, పోల్ మేనేజ్‌మెంట్ వ్యూహాలను చెల్లాచెదురు చేసేందుకే 'డేటా చోరీ'ని 'సిట్' స్థాయి కేసుగా మార్చి బిల్డప్ ఇచ్చారంటున్నారు.

మరోపక్క, వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేవలం తాను రాజశేఖర్ రెడ్డి కొడుకు కాబట్టే తనకు ముఖ్యమంత్రి అర్హత ఉందని తొలి నుంచి నమ్ముతున్న వ్యక్తి. ఆయన సొంతంగా పార్టీని పెట్టుకున్నా, అందులో పేరు సహా మొత్తం నిర్మాణం తండ్రి నేపథ్యం చుట్టూనే ఉంది.

ఇక దిగువస్థాయిలో అనంతపురం నుంచి మొదలుపెడితే, దాదాపు ప్రతి జిల్లాలో వారసులు దర్శనమిస్తారు. అధికార తెలుగుదేశంలో ఒక పద్ధతి ప్రకారం వారసులను అభివృద్ధి చేసినట్లు కనిపిస్తుంది. జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు

పవన్‌కుమార్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుమారుడు కేఈ శ్యామ్, దివంగత ఎర్రన్నాయుడు కుమార్తె భవానీ, పరిటాల సునీత కుమారుడు శ్రీరామ్, గౌతు శ్యామసుందర శివాజీ కుమార్తె శిరీష, దేవినేని నెహ్రూ కుమారుడు అవినాష్, రాయపాటి సాంబశివరావు కుమారుడు రంగారావు, టీజీ వెంకటేష్ కుమారుడు భరత్, ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల తదితరులంతా తెలుగుదేశంలో వారసులుగా ఎన్నికల్లో పోటీ లేదా పదవుల వరుసలో ఉన్నారు. జాబితాలో ఇంకా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి, జలీల్‌ఖాన్ కుమార్తె షబానా ఖాతూన్, మావోయిస్టు కాల్పుల్లో మరణించిన కిడారి సర్వేశ్వరరావు కుమారుడు శ్రావణ్ కుమార్, దివంగత గాలి ముద్దుకృష్ణమ నాయుడి కుమారుడు భానుప్రకాష్, కిమిడి మృణాళిని కుమారుడు నాగార్జున, బాలకృష్ణ, ఆయన చిన్నల్లుడు శ్రీభరత్, అశోక్ గజపతిరాజు కుమార్తె, మురళీమోహన్ కోడలు తదితరులు ఉన్నారు. ఇలా కొత్తగా వస్తున్నవారు కాకుండా భూమా అఖిలప్రియలాంటి పాతవారు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నారు. జేసీ, పరిటాల, దేవినేని వంటి ఇంటిపేర్లన్నీ కుటుంబ రాజకీయాలకు సంకేతాలుగా పాతుకుపోతున్నాయి.

వారసత్వ రాజకీయాల ప్రతినిధిగా జగన్ స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలా పాతుకుపోయిన ఇంటిపేర్ల వారసులున్నారు. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో అనేది ఎన్నికల ఫలితాలను బట్టి, మళ్లీ ఎన్నికల సమయంలో వాతావరణాన్ని బట్టి ఉంటుందని మనం అర్థం చేసుకుంటుండాలి.

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సామాన్య యువతకు ఇతర ప్రధాన పార్టీలకంటే కొంతమేర మెరుగ్గా టికెట్లు ఇచ్చారుగానీ.. వారసత్వ రాజకీయాల పట్ల మాత్రం నిర్ద్వంద్వంగా వ్యవహరించలేకపోయారు. రాచమార్గంలో తన సోదరుడు నాగబాబుకు పార్టీలో సభ్యత్వ పత్రంతోపాటు అసెంబ్లీ టికెట్ బీ–ఫారం కూడా అందజేశారు.

తెలంగాణలోనైతే కుటుంబ రాజకీయాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంకా పెద్ద చిరునామా. ఆయన పార్టీ టీఆర్ఎస్‌లో కొడుకు కేటీఆర్, కుమార్తె కవిత, వారి దగ్గర చుట్టాలదే పెత్తనం. మేనల్లుడు హరీష్‌రావుతో మాత్రం ఈమధ్య కొన్ని విభేదాలచ్చాయట. ఇక సొంతపార్టీ వారు, ఆపరేషన్ ఆకర్ష్‌తో లాక్కున్నవాళ్లు అని చూడకుండా లెక్కేస్తే.. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కె. కేశవరావు, పోచారం శ్రీనివాసరెడ్డి, మహేందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కడియం శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, నాయిని నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, దివాకర్‌రావు, జితేందర్‌రెడ్డి, చందూలాల్ నుంచి ముఠా గోపాల్ దాకా బోలెడుమంది కనిపిస్తారు. సేకరించి ఏకరువు పెట్టటం అనవసర ఆయాసం. మరోపార్టీ ఎంఐఎం వారసత్వ రాజకీయాల్లో భాగంగా ఒవైసీ సోదరుల గుప్పెట్లో ఉంది.

జాతీయస్థాయిలో ప్రధానమంత్రి మోదీ బ్రహ్మచారిగానీ, ఆయన పార్టీ బీజేపీలో మాత్రం రాజ్‌నాథ్‌సింగ్ నుంచి మొదలుపెట్టి రమణ్‌సింగ్, వసుంధరరాజె వంటి పలువురు సీనియర్ నేతల దాకా వారసత్వ రాజకీయాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

ప్రత్యర్థి పార్టీ కాంగ్రెస్ గురించి చెప్పనక్కర్లేదు. ఆ పార్టీ ఉనికే కుటుంబ రాజకీయం అన్నట్లుగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ నడిపిస్తున్నారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్ సహా పలు రాష్ట్రాల్లో ఆ పార్టీ నేతల వారసులు రాజకీయాల్లో యువతగా చెలామణి అవుతున్నారు.

ఇక ప్రాంతీయ పార్టీల ఆధిక్యత ఉన్న తెలుగేతర రాష్ట్రాలను తీసుకుంటే, తమిళనాడులో డీఎంకేలో స్టాలిన్ సహా కరుణానిధి కుటుంబం, పీఎంకేలో అన్బుమణి, రామదాసు, డీఎండీకేలో విజయకాంత్, ప్రేమలత, కర్ణాటకలో దేవగౌడ, కుమారస్వామి, ఆ తర్వాతి తరం, బంగారప్పలు, మహారాష్ట్రలో శివసేనాధిపతులు, పవార్లు, ఆపైన యూపీలో ములాయం, అఖిలేష్, ఆపక్క బీహార్‌లో లాలూ అండ్ కో నుంచి పైనున్న జమ్మూకాశ్మీర్‌లో అబ్దుల్లాలు, ముఫ్తీల దాకా అనేకమంది కనిపిస్తారు. నిరాంబడరతకు నిదర్శనంగా ఉండే మమతాబెనర్జీ, ఆడంబరానికి సైద్ధాంతికతను జోడించేందుకు విఫలయత్నం చేసే మాయావతి.. తమ మేనల్లుళ్లు అభిషేక్ బెనర్జీ, ఆకాష్ ఆనంద్‌లు తమ వారసులన్నట్లుగా ప్రాధాన్యతనిస్తున్నారు. వీరి మధ్య నితీష్ కుమార్ వారసత్వ ట్రెండ్‌కు భిన్నంగా కొన్ని పరిమితులలోనే అయినా మంచిపాలన కోసం ప్రయత్నించే ప్రజాస్వామిక నాయకుడిలా కనిపిస్తారు.

### ఫలితాల్ని శాసించనున్న బ్రహ్మచారులు/బ్రహ్మచారిణులు

కుటుంబ వ్యవస్థకు పూర్తి భిన్నమైన బ్రహ్మచారులు కూడా ఈసారి ఎన్నికల్లో పెద్దఎత్తున ఫలితాల్ని శాసించబోతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, యూపీలో యోగి ఆదిత్యనాథ్, హర్యానాలో మనోహర్‌లాల్ ఖట్టార్, అసోంలో సర్బానంద సోనోవాల్, బీఎస్పీ నేత మాయావతి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పలువురు ఆర్ఎస్ఎస్ రాజకీయ ప్రచార నేతలు.. ఇలా బ్రహ్మచారుల సంఖ్య కూడా తక్కువగా ఏమీ లేదు. గతంలో వాజ్‌పేయి, జయలలిత బ్రహ్మచారులుగా ఉంటూ సమర్థనేతలుగా గుర్తింపు పొందారు.

కాన్షీరాం కింగ్‌మేకర్‌గా ఎన్నికల రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించారు. కానీ ఆ సంఖ్య ప్రస్తుత ఎన్నికలనాటికి బాగా పెరిగింది.

అటు కుటుంబ వ్యవస్థ ద్వారా వారసులు, ఇటు కుటుంబ ఝంఝాటం లేని బ్రహ్మచారులు ఏకకాలంలో మనదేశంలో ప్రాచుర్యం పొంది దేశ రాజకీయాలను మలుపుతిప్పే స్థాయిలో ఉండటం ప్రధానంగా మన సంస్కృతిలో భాగంగా చోటు చేసుకున్న పరిణామంగా కనిపిస్తుంది. అమెరికా సహా కొన్ని దేశాల్లో కూడా ఇలా వారసులు, బ్రహ్మచారులు రాజకీయాల్లోకి రావడం కనిపిస్తుంది గానీ, మనదేశంలో ఉన్న సాంస్కృతిక నేపథ్యం, కారణాలు, స్థాయి భిన్నంగా ఉంటాయి.

కుటుంబ వ్యవస్థకు ఎక్కువ విలువనిచ్చేవారుగా, మనలో చాలామంది రాజకీయ నేతల వారసులను మరీ గట్టిగా తిరస్కరించలేకపోతున్నాం. అలాగే ఈ సంప్రదాయ రాజకీయ నేతలు దోపిడీ చేస్తూ మనల్ని దగా చేస్తున్నారన్న ఆగ్రహం, వేదన మనలో అంతరాంతరాళాలలో ఉంది. అందుకే పెళ్లి ఝంఝాటాలు లేకుండా సమాజం కోసం పనిచేసే వాళ్లు ముందుకు వస్తే, వారిని ప్రజానీకం నెత్తికెత్తుకుంటోంది. పిల్లలకు ఆస్తుల్ని, పదవుల్ని పంచాల్సిన అవసరం లేదు కాబట్టి.. బ్రహ్మచారులు, బ్రహ్మచారిణులు దోపిడీకి పాల్పడరని, రేయింబవళ్లూ కష్టపడి పనిచేస్తారని (ప్రభుత్వ కార్యాలయాల్లో చేయాల్సిన పనుల్ని కూడా ప్రజలు రాజకీయ నేతల పనిగా భావించే పరిస్థితుల వల్ల ప్రస్తుతం రాజకీయం ఫుల్‌టైమ్ పనిగా మారింది) జనం నమ్మిక. మన బ్రహ్మచారి నేతల్లో కూడా ఎక్కువశాతం మంది వ్యక్తిగతంగా నిజాయతీపరులే. మోదీ వచ్చాక పైస్థాయిలో వ్యక్తిగత రాజకీయ ముడుపులు లేకుండా పోయాయి. మమతా బెనర్జీ తన చాయ్‌కి డబ్బుల్ని కూడా సొంత ఖాతా నుంచే చెల్లించేత నిజాయతీతోపాటు నిరాడంబరత కూడా కలిగినవారు.

బ్రహ్మచారి నేతలను ఆదరించటానికి మన సమాజంలో అనాదిగా వస్తున్న సన్యాసి సంస్కృతి కూడా బాగా దోహద పడుతోంది. సన్యాసులు, మతగురువులను ఆదరించటం భారతీయ సంప్రదాయంలో భాగం. వారు బ్రహ్మచారులుగా ఉంటూ జాతికి ఆధ్యాత్మికతను అందిస్తుంటారని పూజ్యభావంతో చూస్తుంటాం.

స్వతంత్ర భారతదేశ రాజకీయాల్లో బ్రహ్మచారి నాయకులు ప్రాచుర్యంలోకి రాకముందు.. కాంగ్రెస్ హవా కొనసాగుతూ కుటుంబ రాజకీయాలను ఆదరించే సమయంలో వ్యక్తిగత నిజాయతీతో అపార త్యాగాలు చేసిన సోషలిస్టు భావజాల నాయకులను కూడా ప్రజలు ఇలాగే ఆదరించారు. వారి భావజాలానికి కాలం చెల్లిందని ప్రజలు భావిస్తుండటంతో.. కమ్యూనిస్టు పార్టీల్లో ఇప్పటికి కూడా అలాంటి త్యాగాలు చేసేవారున్నా కూడా ప్రజలు ఇప్పుడు వారి పట్ల ఎన్నికల్లో మొగ్గు చూపటం లేదు.

**భారతీయ సంస్కృతికి - భారతదేశ రాజకీయానికి మధ్య కొనసాగుతున్న అగాధం**

ఈ మొత్తం ప్రక్రియలో అసలు రాజకీయానికి పనికొచ్చేవారిని ఎన్నుకునే పరిణతి .. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఏమిటి, అవి ఎవరు సమర్థంగా చేస్తారు అనే ధోరణి మన ప్రజల్లో కరవవుతోంది. కుటుంబ విలువలు, వ్యక్తిగత నిజాయతీ అనేవి కనీస అవసరాలు, అర్హతలే తప్ప పరిమిత వనరుల మధ్య కోట్లమంది ప్రజల జీవితాల్ని బాగు చేయటానికి అవి సరిపోవని వారు గుర్తించడం లేదు.

కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోలా బ్రహ్మచారులు, విడాకులు వగైరా కారణాలతో ఒంటరిగా ఉంటున్నవారు రాజకీయాల్లోకి వచ్చి నేతలుగా, వలంటీర్లుగా సమయం ఇవ్వటం ఆచరణరీత్యా మంచి పరిణామమే అయినా.. వారిలో అవగాహన, విధానపరమైన నిజాయతీకి కాకుండా కేవలం సాంస్కృతిక, వ్యక్తిగత కోణాలకే ప్రాధాన్యత లభిస్తుండటం వల్ల ఒక పరిధి దాటి బ్రహ్మచారి నాయకుల మీద మనదేశ రాజకీయాల్లో ఆధారపడలేం.

దీంతో భారతీయ సంస్కృతికి, భారతదేశ రాజకీయానికి మధ్య పెద్ద అగాధం కొనసాగుతోంది. భారతదేశ సంస్కృతిని అనుసరించి మన రాజ్యాంగాన్ని తిరగరాయాలని కొందరు ఆర్ఎస్ఎస్ అగ్రనాయకులు అంటున్నారు కూడా. అయితే, ఆ మాటల్లో అర్థవంతత కనిపించదు. భారతదేశ సంస్కృతే సమగ్రమైనది, సంపూర్ణమైనది అయితే.. ఇప్పటికీ మన దేశం అగ్రస్థాయిలో కొనసాగుతూనే ఉండాలి కదా! ప్రత్యేకించి రాజ్యాంగం ఎందుకు?.. భారతీయులుగా మనం నేర్చుకోవలసిన విషయాలు, నిరంతరం తాజా పరచుకోవలసిన అంశాలు ఉన్నాయి కాబట్టే.. మనం రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. జాతీయోద్యమ నేతల ఆకాంక్షల్ని నెరవేర్చటానికి.. మన సమాజానికి – రాజ్యాంగానికి మధ్య ఉన్న అగాధాన్ని తొలగించే వ్యవస్థల్ని, 'కేవలం కొన్ని' కుటుంబాల్లోనే కాకుండా 'ఏ కుటుంబంలో పుట్టినా' ఆసక్తి, శక్తి ఉంటే ప్రజాజీవితంలో వేగంగా నాయకులుగా ఎదిగే అవకాశాలనిచ్చే రాజకీయ పార్టీల్ని నిర్మించటం మీద మనం దృష్టి పెట్టాలి.

**మౌలిక మార్పుల్లో రెండు రకాల నేతలదీ వైఫల్యమే**

మన సంస్కృతిలో కుటుంబ వ్యవస్థకున్న ఆమోదాన్ని

ఆసరాగా చేసుకుని వారసత్వ రాజకీయాలు చేస్తున్నవారు, బ్రహ్మచారులుగా నిజాయతీగా పనిచేస్తున్నవారు దేశానికి, రాష్ట్రాలకు కావలసినవన్నీ చేస్తుంటే.. రాజకీయ పార్టీల కోణంలో తప్ప విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఇలా చర్చ చేయాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ ప్రధాని మోదీ దగ్గర్నుంచి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల వరకూ ప్రజలకు అవసరమైన అత్యంత మౌలికమైన సేవల్ని అందుబాటులోకి తేవటంలో, అందుకు తగిన పునాదుల్ని వేయటంలో విఫలమయ్యారు. సాధారణ పాలనలో నవీన్ పట్నాయక్ లాంటి వారు మిగిలినవారికంటే కొంత మెరుగ్గా ఉండొచ్చుగానీ, మౌలికాంశాల్లో ఏమీ తేడా కనిపించదు. ప్రతిపక్షంలో ఉన్నవారూ ఘనంగా చేసేందేమీ లేదు.

దాదాపు 30 ఏళ్ల తర్వాత మోదీకి 2014లో అసాధారణ మెజారిటీతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం రాగా, అధికార కేంద్రీకరణ, దుష్పరిపాలన వంటి కారణాల వల్ల తెలుగునాట రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇవి రెండూ మౌలిక మార్పులకు గొప్ప అవకాశాలు. కానీ ప్రజల్లో పెరుగుతున్న చైతన్యంతో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చటానికి తాత్కాలిక తాయిలాల్ని, చిట్కాల్ని ఆశ్రయించారు తప్ప.. కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో ఏర్పడ్డ ప్రభుత్వాలు ఐదేళ్లలో మౌలిక మార్పు కోసం చేసింది ఏమీ లేదు.

ప్రపంచంలోనే ఇటీవలికాలంలో ఎక్కడా జరగని స్థాయిలో భారత్‌ను కుదిపేసిన పెద్ద నోట్ల రద్దు ద్వారా దేశ ప్రజలు కష్టాలు పడ్డారు, నష్టపోయారుగానీ నల్లధనం, అవినీతి మాత్రం తగ్గలేదు. ఎన్నికల్లో నగదు బ్లాక్‌మనీ రూ.2,000 నోట్ల రూపంలో చెలామణి అవుతోంది. ఏపీ, తెలంగాణ లాంటి చోట్ల ఎన్నికలు వేలం పాటల్లా మారాయి. నోట్ల రద్దు వల్ల గరిష్ఠ లబ్ధి ఏదైనా జరిగిందంటే, అది మోదీ పార్టీకి రాజకీయంగానే. దేశంలో యువజనాభా నానాటికీ పెరుగుతున్నా నాణ్యమైన విద్యను, ఉపాధిని అందించే కీలక బాధ్యతలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. 1972లో ఉపాధి గణాంకాల్ని నమోదు చేయటం మొదలు పెట్టిన దగ్గర్నుంచి ఎన్నడూలేనంతగా 2018లో నిరుద్యోగం 6.1 శాతానికి చేరుకొందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీన్ని ఎదుర్కోలేక గణంకాలను, వాస్తవాలను మరుగున పరిచే ప్రయత్నం చేస్తూ వ్యవస్థలను దెబ్బతీసేందుకు మోదీ సర్కారు ప్రయత్నించింది. దేశ జనాభాలో ఇప్పటికీ అత్యధికులు ఆధారపడిన వ్యవసాయరంగాన్ని ప్రక్షాళన చేసి ఉపాధిని పటిష్టపరిచేందుకు ఏమాత్రం లోతైన అధ్యయనం, ప్రయత్నం చేయకుండా చివరికి ఎన్నికలు వచ్చేనాటికి రూ.6,000 తాత్కాలిక తాయిలాన్ని రైతుకు ప్రకటించారు. అందుకే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనతోపాటు తెలంగాణలో రైతుబంధు, ఏపీలో అన్నదాతా సుఖీభవ పథకాలు అమలవుతున్నా కూడా రైతులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. కేవలం సరైన ఎగుమతులు–దిగుమతుల విధానాన్ని అనుసరించకపోవటం వల్ల మోదీ పాలనలోని మొదటి మూడేళ్లలోనే మనదేశంలోని రైతులు రూ.4,00,000 కోట్లు నష్టపోయారు. వ్యవసాయంలో ఆదాయాన్ని పెంచటం, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలను పెంచటం అనే వ్యూహాన్ని పటిష్టంగా అమలు చేసి ఉంటే ఈవేళ గ్రామాల్లో, యువతలో రగులుతున్న సంక్షోభాన్ని నివారించే అవకాశం ఉండేది. 'ప్రజలకు ఉపాధి లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలకు దిగేవారు కదా?' అని అతితెలివిగా ప్రశ్నించిన మోదీ ప్రభుత్వం.. మద్దతు ధర, రిజర్వేషన్ల కోసం ప్రతిచోటా ఆందోళనలు ఎందుకు ఉధృతమయ్యాయో ఆమాత్రం అర్థం చేసుకోలేదా? పీఎం కిసాన్ తాయిలం, యువతలో ప్రభుత్వోద్యోగాల పట్ల ఉన్న అసంబద్ధమైన పిచ్చిని ఆసరాగా చేసుకుని వారిని బుజ్జగించేందుకు ఈడబ్ల్యూసీ కోటాను ప్రకటించింది ఉపాధి ఆందోళనను చూసి భయపడికాదా? కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్పందించే సగటు రాజకీయవేత్తలా తప్ప.. దేశానికి కీలకసమయంలో దశ–దిశను మార్చే అవకాశాన్ని ఉపయోగించుకునే నాయకుడిలా మోదీ వ్యవహరించలేదు. ఆర్థికంగా పెద్దవైన 49 దేశాలలో కీలకమైన రంగాల పరిస్థితిని బేరీజు వేసి చూస్తే, భారతదేశం అన్నిట్లో చివరి నాలుగైదు స్థానాల్లో ఉంది. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, మహిళల భాగస్వామ్యం, చట్టబద్ధపాలన వంటివి లేకుండా ప్రపంచంలో ఏదేశమైనా అభివృద్ధి చెందిన దాఖలాలున్నాయా? వీటిల్లో చిట్టచివరన ఉన్న మనదేశం మరి అగ్రస్థాయికి ఎలా ఎదుగుతుంది? మనం డబ్బా కొట్టుకుంటున్నట్లు చైనాతోనో, మరో సంపన్న దేశంతోనో ఎలా పోటీ పడగలుగుతుంది?.. గత ప్రధానమంత్రుల్లానే తప్ప బ్రహ్మచారి మోదీ ప్రత్యేకించి సాధించిందేమీ కనిపించదు. నోట్ల రద్దు కావచ్చు, పాలనా సంస్కరణలు కావచ్చు, విదేశాలతో వాణిజ్య యుద్ధం కావచ్చు.. ఒక సమస్యను అంచనా వేయటంలో, దీర్ఘదృష్టితో పరిష్కరించటంలో మోదీ విఫలమవుతున్నారు. నిర్ణయాలకు సరైన బృందాన్ని, పద్ధతుల్ని అభివృద్ధి చేసుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను విమర్శించడం, మరో బ్రహ్మచారి రాహుల్ గాంధీకన్నా తాను మెరుగని చాటుకోవడం తప్ప అదనంగా మోదీకున్న బలం, సంకల్పం పరిమితం.

## తెలుగు రాష్ట్రాల్లో తాయిలాలు, ఎమ్మెల్యే రాజ్యం

అలాగే రాష్ట్రాలకు వస్తే, తాత్కాలిక తాయిలాల్లో మోదీ ట్రైలర్ చూపిస్తే, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భారీ సినిమానే

చూపించారు. ఆర్థిక పరిస్థితుల్ని కూడా విస్మరించి, ఎడాపెడా తాయిలాల్ని, రుణమాఫీల్ని ప్రకటించారు. వీటికి నిధుల కోసం గ్రామాల్ని, పేదలని నాశనం చేసేరీతిలో మద్యాన్ని ఆదాయమార్గం చేసుకున్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటంలో ఘోరనిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్నారు. ఈమధ్య నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె సారస్వత్ తెలంగాణ ఆర్థికవృద్ధిని ప్రశంసిస్తూనే, విద్య, ఆరోగ్యరంగాల్లో రాష్ట్రం వెనుకబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రాథమిక విద్య తీసికట్టుగా ఉందన్నారు. 'మార్కెట్ ఆర్థిక వ్యవస్థ + వంశపారంపర్య రాజకీయాలు – నాణ్యమైన విద్య, ఆరోగ్యం' ఫార్ములా చాలు.. అత్యధిక ప్రజానీకానికి ఎదిగే అవకాశాలు లేవని చెప్పటానికి! సాంకేతికతలో వేగాన్ని మినహాయిస్తే ఏపీ కూడా ఈ మౌలిక విషయాల్లో తెలంగాణ తరహాలోనే ఉంది. నీ పోలీస్, నా పోలీస్, నీ 'సిట్', నా 'సిట్' అంటూ ఇద్దరు చంద్రులూ పోలీస్ వ్యవస్థను సొంత నౌకరీ వ్యవస్థలా మార్చి చట్టబద్ధపాలనను భ్రష్టుపట్టించారు. తెలంగాణలో ప్రతిపక్షం లేకుండా కేసీఆర్ అసెంబ్లీని సొంత అడ్డాలాగా తయారుచేసుకుంటే, ఏపీలో వైఎస్ జగన్ బలమైన ప్రతిపక్షంగా ఉండి కూడా అసెంబ్లీకి వెళ్లకుండా చంద్రబాబు ఏకపక్ష నిర్ణయాలకు పరోక్షంగా కారకులయ్యారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వైఫల్యం, ప్రతిపక్షనేతగా జగన్ వైఫల్యం మధ్య పెద్ద తేడా ఏమీ కనిపించదు.

తెలంగాణలో లాభనష్టాల దీర్ఘకాలిక బేరీజు లేకుండా అసంబద్ధంగా సాగునీటి ప్రాజెక్టులను నిర్మించగా, ఏపీలో విభజన హామీల్ని సాధించటంలో ముఖ్యమంత్రే పార్టీ రాజకీయాలకు ప్రాధాన్యతనిచ్చి విలువైన సమయాన్ని వృధా చేశారు. స్థానిక ప్రభుత్వాలను నిర్లక్ష్యం చేసి ప్రజలను ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేవారుగా చేశారు. ఇటీవల ఏపీలో ఓ ప్రధాన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తన అనుచరులతో మాట్లాడుతూ, "నన్ను గెలిపించండి.. ఎలక్షన్లు అయినాక ఆర్నెల్లు సమయం మీకు ఇడిసిపెడతా.. ఏం చేసుకుంటారో చేసుకోండి. చంపుతారా? కాళ్లు చేతులు ఇరుస్తారా.. పొడుస్తారా, మీ ఇష్టం. అన్నీ నేను చూసుకుంటాను. ఏ పోలీసోడూ మీ వద్దకు రాడు.." అని చెప్పటం ఆడియో టేపుల్లో వింటే, ఎమ్మెల్యే రాజ్యం విస్తరించిన తీరు షాక్‌కి గురిచేయక మానదు.

### సంస్కృతికి - పాలనకు, రాజకీయానికి మధ్య ఉన్న తేడాని గుర్తించాలి

మనం ఆటగాళ్ల గురించి ఆలోచించటం మాని, ఆటనియమాల గురించి ఆలోచించటం మొదలుపెడితేనే మన సంస్కృతికి – పాలనకు, రాజకీయానికి మధ్య ఉన్న తేడాని గుర్తించగలం. ఫలానావాళ్ల కొడుకనో, కూతురనో, వ్యక్తిగతంగా నిజాయతీపరుడనో, తెగ కష్టపడే వ్యక్తనో మాత్రమే కాకుండా.. రాష్ట్ర, దేశ అవసరాలేంటి, వాటికి పరిష్కారంగా ఎటువంటి రాజకీయాన్ని, పాలనా విధానాలను ప్రతిపాదిస్తున్నారు, వాటిని ఎలా అమలు చేస్తారు, వారి క్రియాశీల గత చరిత్ర ఏమిటి వంటివి వరిగణలోకి తీనుకుని నాయకులను ఎంచుకోగలుగుతాం. ఇందుకు పెద్ద సంస్కరణలు.. అంటే ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటివి మనకు కాస్త పెద్ద విషయాలు అనిపించొచ్చు, జాతీయ స్థాయిలో చేయాల్సిన ఆ పనులకు కొంత సమయం పట్టవచ్చు. కానీ మన చేతిలో, రాష్ట్రాల స్థాయిలో, ఓటును ఉపయోగించుకుని, వెంటనే తెచ్చుకోగలిగిన మార్పులు కొన్ని ఉన్నాయి.

### ముందు ప్రభుత్వ కార్యాలయాలను ప్రక్షాళన చేయాలి, ఎమ్మెల్యేలు, పార్టీల అవసరం లేకుండా ఉద్యోగులను జవాబుదారీ చేయాలి

వీటిల్లో మొదటిది, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేటర్లు వంటి ప్రజాప్రతినిధుల మీద ఆధారపడకుండా ఉండటం. మనం కట్టే పన్నుల డబ్బు నుంచి మనలో అనేకమంది కంటే అనేకరెట్లు ఎక్కువ జీతాలు తీసుకుంటూ, జీవనభద్రతను పొందుతూ, పెద్దమొత్తంలో పింఛన్లను అనుభవిస్తూ, బ్రిటీషుకాలం నాటి అధికారుల్లా మనల్ని చులకనగా చూస్తూ, లంచాలు గుంజుతున్న ప్రభుత్వోద్యోగుల చేత సక్రమంగా పనిచేయిస్తే మన సమస్యల్లో చాలావరకూ గాడిన పడతాయి. మనకు సేవకులుగా ఉండాల్సిన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ అవినీతికి, పెత్తందారీతనానికి చిహ్నంగా మారటం మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల్లో ఒకటి. బ్రిటీష్ వాళ్లు మనల్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసినా, వాళ్లు అధికారులుగా ఎంతో బాధ్యతతో పనిచేసేవారు. మన అధికారుల్లో చాలామంది కంటే గొప్ప సేవలు అందించిన బ్రిటీష్ ఆఫీసర్లు ఉన్నారు. రోజూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోవటం కోసం మనం పడుతున్న అవస్థల్ని ఆసరాగా చేసుకుని రాజకీయ పార్టీలు మధ్యవర్తిత్వం చేసే పనిని ప్రారంభించాయి.

స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు కొంత నిస్వార్థంగా ఈ సేవల్ని అందించేవారు. అప్పట్లో బ్రిటీష్ సంస్కృతి నేపథ్యంలో ఉద్యోగులను చూసి ప్రజలు భయపడుతుండటం వల్ల ఈ పని కొంత ఉపయోగపడుతున్నట్లు కనిపించింది. కానీ ప్రభుత్వోద్యోగ వ్యవస్థను మార్చకుండా, రానానూ రాజకీయ పార్టీల వాళ్లే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టి ప్రతిఫలంగా ఓటును ఆశించే పరిస్థితి పెరగటంతో.. మన గొప్ప రాజ్యాంగ ప్రజాస్వామ్యం

వేళ్లూనుకోకుండానే ప్రహసనంలా మిగిలిపోయింది. 'ఓటింగ్ అండ్ షూటింగ్'కు పరిమితమైపోయింది. ఇప్పుడైతే తెలుగుదేశం, టీఆర్ఎస్, వైసీపీ, కమ్యూనిస్టులు, డీఎంకే, బీజేపీ అని తేడా లేకుండా అందరిదీ ఇదే రాజకీయం.

ఇలా సర్కారీ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్లలో పనులు చేసి పెట్టేందుకు నియోజకవర్గాలవారీగా కొంతమందిని మెయింటెయిన్ చేయటమే రాజకీయ పార్టీలకు పెద్ద ఖర్చుగా మారింది. ఇటీవల పలు రాజకీయ పార్టీలు తమకొచ్చిన విరాళాల్ని (నల్లడబ్బు మినహాయించి) ఎలా ఖర్చు చేశామో వార్షిక వివరాల్ని సమర్పించాయి. అందులో వాటి నిర్వహణ ఖర్చే అత్యధికంగా ఉంది. ఈ భారం పెరుగుతున్నకొద్దీ, ధన రాజకీయాలు పెరిగిపోతాయి. దానికితోడు ప్రజల రోజువారీ ఫిర్యాదుల్ని పరిష్కరించటానికి ఎమ్మెల్యేలకు రోజుకు 24 గంటలు కూడా తక్కువగా అనిపిస్తుంటాయి. ఫిర్యాదులస్తే అర్ధరాత్రయినా లేచి పరిగెట్టాల్సిందే. నియోజకవర్గంలో ఏ చిన్న కార్యక్రమమైనా అటెండ్ అవ్వాల్సిందే. ఇలా ఫుల్‌టైమ్ పనిచేయాల్సి రావటం.. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో మరీ ఎక్కువైంది (ఇంతకుముందే చెప్పుకున్నట్లు.. రాజకీయాల్లో ఇలా ఫుల్‌టైమ్ పనిచేస్తారన్న భావంతోనే బ్రహ్మచారుల పట్ల ప్రజలు కూడా ఎక్కువ మొగ్గు చూపుతున్నారు).

డబ్బున్నవారు, జులుం చెలాయించగలిగినవారు మినహాయించి సామాన్యులు, చట్టాన్ని గౌరవించేవారు ఎన్నికల రాజకీయాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. చట్టాన్ని ధిక్కరించే నేరచరితులకు ఎన్నికల్లో ఆదరణ ఎక్కువగా ఉంటోంది. ఒక్కసారి 'పౌర సేవల' చట్టం, సేవలను బట్టి ఉద్యోగంలో కొనసాగే పద్ధతులు, పౌర సమాజంలోని వారి సేవలనూ ప్రభుత్వోద్యోగాల్లో ఉపయోగించుకోవటం వంటి ఏర్పాట్లతో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా, జవాబుదారీతనంతో నాణ్యమైన సేవల్ని అందించే వ్యవస్థను నిర్మించగలిగితే.. ఇక ఎమ్మెల్యేలకు అక్కడ పని ఉండదు. అనుచరుల పేరుతో వందలమందిని నెలనెలా పోషించాల్సిన అవసరముండదు. రాజకీయాల్లో ఫుల్‌టైం గొడ్డుచాకిరీ చేసి ప్రతిఫలంగా కోట్లు దోచుకోవటం ఆగిపోతుంది. ఎప్పుడైతే ఈ ఖర్చు తగ్గిందో, సొంత జీవితం చూసుకుంటూ కూడా రాజకీయాల్లో పనిచేసే వాతావరణం ఏర్పడుతుందో.. అప్పుడు సేవాభావంగల సమర్థులు, నిజాయతీపరులైన సామాన్యులు, మధ్యతరగతివారు ఎన్నికల్లో నిలబడడానికి ముందుకొస్తారు. భారీ డబ్బుతో గెలవలేదు కాబట్టి, తిరిగి దోచుకోవాల్సిన అవసరం వారికి ఉండదు. వీరిలో కూడా కొద్దిమంది తర్వాతికాలంలో అవినీతిపరులుగా మారొచ్చు. అవినీతి నిరోధక వ్యవస్థల్ని పటిష్టం చేసుకోవటం, మరికొన్ని సంస్కరణలతో అలాంటి కొద్దిమందిని అదుపుచేయటం పెద్దకష్టం కాదు.

**ఇక రెండోది, స్థానికంగా సమస్యలపై పనిచేస్తూండటం.**

ఇటీవల ఈ రచయిత ఒక వ్యక్తిగత పని మీద ఆంధ్రప్రదేశ్‌లోని ఓ గ్రామ పంచాయతీలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గనడం జరిగింది. దాదాపు రెండు గంటలపాటు ఆ కార్యక్రమంలో అన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే, ప్రజల సాధికారతకు దోహదం చేసే ధోరణులు అందులో చాలా తక్కువగా కనిపించాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగానే వినియోగిస్తున్నా, ప్రజల భాగస్వామ్యం లేకపోవడం వల్ల అది కృత్రిమ మెరుగులా మిగిలిపోయింది.

ఆ పంచాయతీలో గత నాలుగైదేళ్లుగా చేసిన కార్యక్రమాల్ని, రాబోయే ఐదేళ్లలో చేయతలపెట్టిన కార్యక్రమాల్ని లిఖితపూర్వకంగా ఫ్లెక్సీల రూపంలో పంచాయతీ కార్యాలయం గోడలకు తగిలించారు. వీటిలోని వివరాల ప్రకారం.. ఆ ఊరికి ఒక్క అవార్డు కూడా రాలేదు, ఊరిలో వేసిన రోడ్లు 100 మీటర్లు మాత్రమే. విద్య, ఆరోగ్యం వంటి మౌలికాంశాల్లో చెప్పుకోదగిన విజయాలేమీ లేవు.. అయినా ఎవరూ వాటి గురించి మాట్లాడలేదు. అందరి దృష్టీ ప్రభుత్వ తాత్కాలిక తాయిలాల పందేరాన్ని ఎలా పొందాలి? అనే దాని మీదే కేంద్రీకృతమై ఉంది. గ్రామాలు మేధస్సు, నాయకత్వ కొరతతో సతమతమవుతున్నాయని అక్కడి ఉపన్యాసాలు, ప్రతిస్పందనలు వింటే అర్థమవుతుంది. అధికారపార్టీ నేతలతో కూడిన జన్మభూమి కమిటీలు, దాని చుట్టూ కులరాజకీయాలు, పథకాల పందేరానికి జన్మభూమి కార్యక్రమాలు.. ఇలాంటి స్థానిక పాలన వల్ల ప్రజలకు ఉపయోగమేమీ ఉండదు. ఈ పరిస్థితిని ఛేదించేలా గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల వార్డుల్లో స్థానికంగా పని ప్రారంభించాలి.

ముఖ్యంగా యువత ఎక్కడికక్కడ తమ చుట్టూ ఉన్న సమస్యలపై పనిచేస్తూ, పరిష్కారాలను సాధిస్తుంటే క్రమంగా నాయకత్వం పెరుగుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్థానిక ప్రభుత్వాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే గుప్పిటపట్టి అణచివేస్తున్నాయన్నది వాస్తవం. కానీ స్థానికంగా వచ్చే మార్పుల్ని అడ్డుకునే శక్తి పైస్థాయిలో ఎంత బలమైన నాయకుడున్నా కూడా సాధ్యం కాదు. అందుకే ఒకపక్క స్థానిక ప్రభుత్వాలకు అధికారాల్ని, నిధుల్ని పెంచుకునేలా విధానపరమైన మార్పుల కోసం ప్రయత్నిస్తూ, స్థానికంగా నాయకులుగా ఎదగడానికి యువత కృషి చేయాలి.

ప్రభుత్వ కార్యాలయాల్ని నిజమైన ప్రజాసేవా కేంద్రాలుగా

మార్చటం, స్థానిక సమస్యలపై పనిచేయటం.. ఇవి రెండూ ఇప్పుడున్న పరిస్థితుల్లో సామాన్యుల నుంచి నాయకత్వం ఎదగటానికి, ఎన్నికల మధ్య సమయంలో కూడా ప్రజలు పాలకులపై ప్రభావం చూపటానికి ఉపయోగపడే పరిష్కారాలు.

ఈ పరిష్కారాల్లో భాగమవటానికి మనకు కొంత పరిజ్ఞానం అవసరం. ఏ అంశాలను పరిష్కరించటానికి ఏ గీటురాళ్లను ఉపయోగించాలి, ఒక సమస్యను పరిష్కరించటానికి మూలాన్ని తెలుసుకోవటం వంటి వాటిని తెలుసుకోవాలి. ప్రజల్లో ఆలోచనాస్థాయిని పెంచి సంఘటితంగా పనిచేసేలా చేయటానికి.. చిన్న చిన్న కార్యక్రమాల చుట్టూ వారిని సమీకరిస్తుండాలి. వ్యక్తిగతం, కుటుంబం, ప్రభుత్వం.. వీటి మధ్య పనుల్లో ఉండే తేడా ఏమిటి? ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటి, వాటిని సాధించుకోవటానికి రాజకీయ పార్టీల ఎజెండా ఎలా ఉండాలి? వగైరా అంశాల మీద స్పష్టతను పెంచాలి. పెద్దగా డబ్బు లేకున్నా, తమ వ్యక్తిగత జీవితాల్ని చూసుకుంటూ కూడా రాజకీయాల్లో పనిచేసేందుకు అవకాశాలున్నాయన్న స్పష్టత ఎప్పుడైతే వస్తుందో, అప్పుడు క్రమంగా సామాన్యుల నుంచి కూడా నాయకత్వం రావడం మొదలవుతుంది. ఇప్పుడున్న ధన రాజకీయాన్ని, వారసత్వ రాజకీయాన్ని మార్చాలంటే ఈ నాయకత్వం చాలకపోవచ్చు. కానీ కచ్చితంగా సామాన్యుడి తిరుగుబాటుకు గట్టి పునాది పడుతుంది. పైన పేర్కొన్న ఎన్నికల సంస్కరణలు, ఇంకొన్ని ఇతర మార్పుల్నీ కూడా సాధించుకుంటూ వెళ్తుంటే క్రమంగా మనదేశంలోనూ సమర్థులైన నాయకులు రాజకీయాల్లోకి వచ్చి చట్టసభల్లోకి అడుగుపెట్ట గలుగుతారు. కేవలం కొన్ని కుటుంబాల వారసత్వ నేతల స్థానంలో.. అన్ని కుటుంబాల వారసులకు, అపరిపక్వ బ్రహ్మచారి నాయకుల స్థానంలో.. పరిణతిగల నిజాయతీపరులైన కోట్లాది సామాన్య ప్రజలకు ఎన్నికయ్యే అవకాశాలు లభిస్తాయి.

### నష్టపోయాకగానీ తెలుసుకోలేని అమాయకత్వం నుంచి బైటపడదాం

త్రి శ్రీ వద్దు.. ద్వి శ్రీ చాలు.. అని తన పేరుకు ముందు శ్రీశ్రీని పెట్టుకున్న రవిశంకర్ గురూజీ ఇటీవల ఓ పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "పాశ్యాత్యులకు భిన్నంగా.. మన సంప్రదాయంలో తొలుత అనుభవంలోకి వచ్చాక నమ్ముమంటాం" అని భారతీయతను ప్రశంసించారు. భారతీయ సంస్కృతి పాశ్చాత్యుల నాగరికత కంటే పలు అంశాల్లో మిన్నగా ఉంటుందనటంలో సందేహం లేదు. కానీ నేర్చుకోవటం దగ్గర మన దృక్పథం చాలా లోపభూయిష్టమైనది. మనం విద్యను, మేధస్సును గౌరవిస్తాం, గొప్పగా చూస్తాం. కానీ విద్య విలువేంటో మనకు పూర్తిగా తెలియదు. విద్యను, మేధస్సును జీవితానికి అన్వయించటంలో మనం చాలా దేశాల కంటే బాగా వెనుకబడి ఉన్నాం. ప్రతిదీ అనుభవంలోకి వచ్చాక గానీ తెలుసుకోలేము అనే ధోరణి వల్ల చాలా మూల్యం చెల్లిస్తున్నాం. మనకంటే ముందే ఒక విషయాన్ని తెలుసుకుని, మంచీచెడులను విశ్లేషించి, చక్కటి ఆచరణసాధ్యమైన పరిష్కారాన్ని ఓ మేధావో, పుస్తకమో సూచిస్తే.. ఆ మనకెందుకిప్పుడు, తర్వాత చూద్దాం అని పక్కనపడేస్తాం. అనుభవమైతే అప్పుడు మారదాం అన్నట్లు వ్యవహరిస్తుంటాం. ఇతరుల అనుభవం నుంచి నేర్చుకునే ఈ శక్తి లోపించటం వల్ల మనం ఎంతోమంది ప్రజలు నష్టపోయాకగానీ ఏ విషయంలోనూ మేలుకోలేకపోతున్నాం. కేవలం నేర్చుకునే దృక్పథంలో లోపం వల్ల నివారించదగ్గ ఎన్నో ప్రమాదాలు, వినాశకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీనికితోడు కులం, మతం, ప్రాంతం వంటి ఎన్నో పూనకాలు. వీటిని వదిలించుకుని సత్యం, శాస్త్రీయత ఆధారంగా, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయగలిగే ప్రజాస్వామిక దృక్పథంతో స్పందించే శక్తిని మనం అలవరచుకోవాలి. విశ్వాసాలను, ఇష్టాయిష్టాలని వ్యక్తిగతానికి పరిమితం చేయాలి. ఎవరు చెబుతున్నారు అనే దృష్టితో కాకుండా, ఏం చెబుతున్నారు అనే దృష్టితో వాస్తవాల పట్ల తక్షణం స్పందించి దిద్దుబాటు చేసుకోగలగాలి.

ఈ రకమైన సానుకూల అవగాహనతో 2019 ఎన్నికలను చూస్తే, మన నాయకులు, వారి రాజకీయం వల్ల మనకున్న ఎదిగే అవకాశాలు ఎంత పరిమితమైపోతున్నాయో గోచరిస్తుంది.

### యధాతథస్థితిని, నిరాశను ఛేదిద్దాం .. జనరాజకీయ నాయకులను తయారు చేసుకుందాం

ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు వేసినా గెలిచిన ఎమ్మెల్యే అదే పార్టీలో కొనసాగుతాడని గ్యారంటీ లేదు. తాయిలాలు తప్ప ఎదిగే అవకాశాలకు గ్యారంటీ ఉండదు. వంశపారంపర్య రాజకీయాలు, ఫిరాయింపులు ప్రజాస్వామ్యంలో సాధారణమే అని తప్పుడు భాష్యాలనిస్తూ ప్రజలను మోసం చేయటంలో ప్రధాన పార్టీల నేతలు ఐక్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ఎన్నికల గురించి మనం చించుకోవటం అనవసరం. యధాతథ స్థితిని కొనసాగించాలనుకునే యధాలాప ధోరణి నుంచి బైటపడదాం, మార్పు సాధ్యం కాదనే నిరాశను ఛేదిద్దాం.. వీలైనంత మేర పైన పేర్కొన్న 'ప్రజల ఎజెండా' కోసం ఈ ఎన్నికల్ని ఉపయోగించుకుంటూనే, ఇప్పుడున్న వంశపారంపర్య, బ్రహ్మచారి నాయకులకంటే సమర్థులైన రాజనీతిజ్ఞ నాయకులను కోట్లాది సామాన్య ప్రజల నుంచి తయారుచేసుకుందాం. ■

# ఎన్నికల్లో నల్లధనం మాటేమిటి?

**-ఎ. కృష్ణారావు,** సీనియర్ జర్నలిస్టు

**ఎన్నికల సంస్కరణల విషయమై 1990లో గోస్వామి కమిటీ నుంచి 2008లో రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు ఎన్నో సూచనలు చేశాయి. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ వీటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపలేదు. నల్లధనాన్ని అరికడతానని హంగామా చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో నల్లధనం పాత్ర పెరిగిన దాఖలాలే తప్ప తగ్గిన సూచనలు లేవు.**

పార్లమెంట్ సెంట్రల్‌హాలులో చాలామంది ఎంపీలు ఇటీవల (ఎన్నికల ప్రకటనకు ముందు) చాలా దిగులుగా కనిపించారు. మళ్లీ ఎన్నికలు వస్తాయని, మళ్లీ కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని వారు బాధ వ్యక్తం చేశారు. ఎంపి పదవికి పోటీ చేయడం కన్నా ఎమ్మెల్యే సీటుకు పోటీ చేస్తే ప్రయోజనం ఎక్కువుంటుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఆమధ్య జరిగిన అసెంబ్లీల ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలు తిరిగి అధికారంలోకి రావడానికి భారీ ఎత్తున ఖర్చుపెట్టాయి. అధికారంలో లేని పార్టీలే భారీ ఎత్తున డబ్బులు ఖర్చులు పెడుతున్నప్పుడు అధికారంలో ఉన్న పార్టీ భారీ ఎత్తున ఖర్చు పెట్టడంలో ఆశ్చర్యం ఏముంది? అని ఎంపీలు చర్చించుకుంటున్నారు. ఎన్నికలంటూ జరిగిన తర్వాత అధికారంలో ఉన్నా, లేకపోయినా పార్టీలు, అభ్యర్థులు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. పొరుగు రాష్ట్రాల నుంచి, కార్పొరేట్ల నుంచి కూడా నిధులు ప్రవహిస్తాయి. ఫలానా రాష్ట్రంలో ఫలానా ప్రభుత్వం ఉండడం వల్ల ఫలానా వారికి ప్రయోజనం ఉంటుందనే చర్చ ప్రతి ఎన్నికల్లోనూ జరుగుతుంది. కర్ణాటక ఎన్నికల సమయంలో కూడా బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెద్ద ఎత్తున రంగంలోకి దిగారు. వారు ఏమీ ఉత్తి చేతులతో రారు కదా. అదే సమయంలో కాంగ్రెస్‌కు సహాయం చేయకుండా అనేక కార్పొరేట్ సంస్థలపై, వ్యక్తులపై ఆదాయపన్ను దాడులు జరిగాయి. ఏది ఏమైనా ఎమ్మెల్యేగా పోటీ చేయడం వల్ల అటు వ్యక్తిగతంగానూ, ఇటు రాజకీయంగానూ లాభం ఉంటుందని ఎంపీలు అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. తమ పార్టీ గెలిస్తే మంత్రిపదవులు, పైరవీలు, తమ పార్టీ ఓడిపోయి తాము ఎమ్మెల్యేలుగా మిగిలితే అధికార పార్టీతో కుమ్మక్కయ్యే అవకాశాలు. లేదా తాము ఎమ్మెల్యేగా ఓడిపోయినా ఎన్నికల




కోసం వచ్చిన డబ్బుల్లో ఎంతో కొంత మిగుల్చుకునే అవకాశాలు ఎలాగూ ఉంటాయి.

'మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు.. ఎమ్మెల్యేకున్న విలువ మాకేమున్నది?' అని బాధపడే ఎంపీలు చాలా మంది ఉన్నారు. 'ఈసారి నేను ఎమ్మెల్యే సీటుకు పోటీ చేయాలనుకుంటున్నాను' అని ఒకరంటే 'మనకు టికెట్ ఇస్తారంటారా' అని మరొకరు ప్రశ్నిస్తున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే ఎంపీలు చాలామంది ఎమ్మెల్యేల పట్ల ఈర్ష్య పడుతున్నారు. అనేక కార్పొరేట్ సంస్థలకు యజమాని అయి, ఎంపీగా ఉన్న ఒక నేత కూడా 'అసలు ఎమ్మెల్యేల వద్ద ఇంత డబ్బెలా వస్తున్నది!' అని ఆశ్చర్య పోతున్నారు. ఒకప్పుడు తన సహాయంతో గెలిచిన ఒక ఎమ్మెల్యే ఇప్పుడు రోడ్డుకు అటూఇటూ ఉన్న భూములన్నీ తనవేనని చెప్పుకుంటున్నారని ఆయన వెల్లడించారు. ఎంపీలు డబ్బు సంపాదించడం లేదని కాదు, ఎమ్మెల్యేల అంత సంపాదించలేక పోతున్నామనే వారి బాధ.

అసలు ఇంత డబ్బు సంపాదించడం అవసరమా అన్నది

కీలకమైన ప్రశ్న. 'రాజకీయాల్లో ప్రవేశించిన ప్రతివాడూ అత్యంత ధనికుడుగా మరణించడం అవసరమా?' అని ఒక మాజీ ఎంపీ ప్రశ్నించారు. ఇవాళ రాజకీయాల్లో ఉన్న వారు అత్యంత ధనికులుగా మరణించాలనుకుంటున్నారు కాని, ఉన్నత వ్యక్తిత్వంతోనో, గొప్ప ప్రజాసేవకుడుగానో మరణించాలనుకోవడంలేదని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ప్రజాప్రతినిధులయ్యేవారిలో చాలామంది ఎడా పెడా ఆర్జించేందుకు అవసరమైన పరిస్థితులను ప్రభుత్వాలే కల్పిస్తున్నందువల్ల ఎవర్ని తప్పుపట్టాలో అర్థం కావడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎన్నికల్లో డబ్బులు ఎలా ఖర్చు పెడతారు? అన్న ప్రశ్న అమాయకమైనది. ప్రజలను సానుకూలంగా మార్చుకునేందుకు ఏ స్థాయిలో ఎప్పుడు ఎంతమేరకు ఖర్చు పెట్టాలన్నది ఒక శాస్త్రీయమైన కళ. బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, పన్నా ప్రముఖ్‌లు, ఐటి కేంద్రాలు, కన్సల్టంట్లు, సోషల్ మీడియా ప్రచారాలు, ప్రకటనలు, బ్యానర్లు, కటౌట్లు, పరిశీలకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తల్ని దించడం, ఇంటింటికీ ప్రచారం, సర్వేలు, ఇవన్నీ పైకి కనపడే ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలు. మద్యం, నోట్ల పంపిణీ మాత్రమే కాదు అన్ని స్థాయిల్లో అనేక యంత్రాంగాల్ని, వ్యక్తుల్ని తిప్పుకోవడం మరో ఎత్తు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు ఉన్నట్లు- గుజరాత్‌లో డిజిటల్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ అయ్యాయని ఆ తర్వాతి కాలంలో తెలిసింది. 'నా పదవీ కాలంలో ఎదుర్కొన్న అత్యంత కీలకమైన సవాలు- రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని అరికట్టడం. ఇది రోజురోజుకూ పెరిగిపోతున్నది' అని ఇటీవల పదవీవిరమణ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓపీ రావత్ అన్నారు. విచిత్రమేమంటే- రోజుకు పదివేల రూపాయల కంటే, మొత్తం ఎన్నికల్లో రూ.28 లక్షల కంటే ఎక్కువ ఖర్చు పెట్టకూడదని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. డబ్బు మంచినీళ్లలా కళ్ల ముందే ప్రవహిస్తున్న ఈ రోజుల్లో ఎన్నికల కమిషన్ ప్రకటన విన్నవారికి నవ్వు రాకమానదు. అసలు పార్టీలు పెట్టే ఎన్నికల ఖర్చుకు పరిమితి లేదన్న విషయం చాలామందికి తెలియదు. అసలు ఎన్నికల కమిషన్ అనుమతించిన దానికంటే పోలీసులు స్వాధీనం చేసుకున్న మొత్తం ఎన్నోరెట్లు ఎక్కువ ఉంటుంది. కర్ణాటక ఎన్నికల్లో రూ.5,600 కోట్ల మేరకు ఖర్చయిందని క్రింది స్థాయిలో పనిచేసే కన్సల్టంట్లు చెప్పినట్లు ఒక వార్తాకథనం ప్రచురితమైంది.

భారతదేశంలో ఎక్కడా ఎన్నికల్లో సామాన్యుడు పోటీ చేసే పరిస్థితి లేదని అనే వారు చాలా మంది ఉన్నారు. అధికార పార్టీ అండతోనో, మరో వెన్నుదన్నుతోనో పోటీ చేసిన సామాన్యులు కూడా అనతికాలంలోనే సంపన్నులు అయిపోతున్నారు. రాజస్థాన్ ఎన్నికల్లో ఇటీవల గెలిచిన ఎమ్మెల్యేలలో 73 శాతం మంది కోట్లకు పడగలెత్తినవారు. అసలు రాజస్థాన్ నుంచి పోటీ చేసిన బిజెపి అభ్యర్థుల్లో 81 శాతం మంది కోటీశ్వరులు. మధ్యప్రదేశ్‌లో 656 మంది కోటీశ్వరులు పోటీ చేయగా, వారిలో 161 మంది గెలిచారు. ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో కూడా 42 మంది కోటీశ్వరులు పోటీ చేశారు.

అసలీ డబ్బులు ఎలా వస్తున్నాయి? అధికారంలో ఉన్న పార్టీలు ఎంత ఆర్జిస్తే ఇంత భారీ ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టగలుగుతాయి? అసలు రాజకీయ పార్టీలకు ఏఏ పారిశ్రామిక సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలు సహాయపడుతున్నాయి? ఎందుకు సహాయపడుతున్నాయి? ఈ ప్రశ్నలను సామాన్యులెవరూ అడగడం లేదు. ఎన్నికల నిధుల వెనుక పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ సంస్థల హస్తం ఉందని అనేక అధ్యయనాల్లో తేలింది. ఈ డబ్బంతా లెక్కలు చెప్పలేని నల్లధనం అనడంలో కూడా అతిశయోక్తి లేదు. మరి ఈ దేశంలో నల్లధనాన్ని నిర్మూలిస్తానని పెద్దఎత్తున వాగ్దానాలు చేసిన నరేంద్రమోదీ ఏమి సాధించారు? మన కళ్ల ముందు ఎన్నికల సమయంలో ప్రవహిస్తున్న నల్లధనాన్ని అరికట్టలేని వారు దేశంలో నల్లధనాన్ని మొత్తంగా ఎలా నిర్మూలించగలరు? నల్లధనాన్ని అరికట్టేందుకు పెద్ద నోట్ల రద్దుతో సహా అనేక చర్యల్ని మోదీ ప్రభుత్వం తీసుకోలేదని చెప్పలేం కాని దాని వల్ల ఏం ప్రయోజనం కలిగింది? పెద్ద నోట్ల రద్దు మూలంగా ఏ ఫలితమూ రాలేదని రద్దయిన నోట్ల విలువ దాదాపూ తిరిగి వచ్చిందని రిజర్వు బ్యాంకు వార్షిక నివేదికే చెప్పింది. మహా అయితే ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ చర్య వల్ల బిఎస్‌పి, ఎస్‌పి లాంటి పార్టీలకు కొంత చెప్పుకోలేని ఇబ్బందులు ఎదురయి ఉండవచ్చు. స్థూలంగా చూస్తే పెద్ద నోట్ల రద్దు కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం తీసుకున్న చర్య మాత్రమే కాని నల్లధనాన్ని అరికట్టేందుకు నిజాయితీతో చేపట్టిన చర్య కాదని అర్థమవుతోంది. ఇక ఆదాయ ప్రకటన పథకం, బినామీ నిషేధ చట్టం, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన, ఆదాయపన్ను దాడులన్నిటితోనూ కలిపితే లక్షా 15 వేల కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నామని


ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో వేల కోట్ల నల్లధనం ఎలా ప్రవహించింది? నరేంద్ర మోదీ చెప్పగలరా?

విచిత్రమేమంటే విదేశాల్లో ఉన్న నల్లధనం గురించి దేవుడెరుగు. స్వదేశంలో ఉన్న నల్లధనాన్ని అరికట్టడంలో మన దర్యాప్తు సంస్థలు విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేయగలదు. ఎన్నో దర్యాప్తు సంస్థలు కేంద్రం చేతుల్లో ఉన్నాయి. రాష్ట్రాల చేతుల్లో కూడా ఎన్నో సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలన్నీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకోవడం వల్ల, ఆ సంస్థలకు, వాటిపై అజమాయిషీ చలాయించే వారు కుమ్మక్కు కావడం వల్ల ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. అధికార పార్టీ నాయకులపై, వారికి సహాయం చేసే పారిశ్రామిక సంస్థలు, వ్యక్తులపై, ప్రాంతీయ కుబేరులపై దాడులు జరిగిన సందర్భాలు ఎక్కడన్నా ఉన్నాయా? 2014లో 500 కోట్ల డాలర్ల మేరకు ఎన్నికల్లో ఖర్చయిందని ఒక అధ్యయన సంస్థ పేర్కొంది. 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున చేసే ప్రచారంలో భారీ ఎత్తున డబ్బు ఖర్చుపెట్టబోమని నరేంద్ర మోదీ గుండెల మీద చేయి వేసుకుని చెప్పగలరా? ఆయన పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు, కార్యకర్తలు తిరిగే హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు, కార్లు, పాల్గొనే బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలకు, అభ్యర్థుల ప్రచారానికి, జనాలను సమీకరించేందుకు అయ్యే ఖర్చంతా తెల్లధనమేనని వారు స్పష్టీకరించగలరా?

'ఏన్ అన్ డాక్యుమెంటెడ్ వండర్, మేకింగ్ ఆఫ్ ద గ్రేట్ ఇండియన్ ఎలెక్షన్' అనే పుస్తకంలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై ఖురేషీ ఎన్నికల సమయంలో డబ్బు ఎంత క్షుద్రంగా ప్రవహిస్తుందో వివరించారు. ఎన్నికల సంస్కరణల విషయమై 1990లో గోస్వామి కమిటీ నుంచి 2008లో రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు ఎన్నో సూచనలు చేశాయి. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ వీటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపలేదు. నల్లధనాన్ని అరికడతానని హంగామా చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో నల్లధనం పాత్ర పెరిగిన దాఖలాలే తప్ప తగ్గిన సూచనలు లేవు.

భారతదేశంలో అధర్మాలు పెరిగిపోతున్నాయని, దేశభక్తిని బాగా ప్రజల్లో పెంచాల్సిన అవసరం ఉన్నదని వాదించే వారితో విభేదించనక్కర్లేదు. కాని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారమైన ఎన్నికల వ్యవస్థలో నల్లధనం ప్రమేయాన్ని అరికట్టి సరైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోగలిగినప్పుడే దేశభక్తి అనే పదానికి సార్థకత ఏర్పడుతుంది. మోదీ ఎజెండాలో ఇలాంటి కర్తవ్యాలు లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. ■


ప్రత్యేక హోదాపై
మళ్లీ మోసపోకండి!




మిత్రులారా! ఆంధ్రప్రదేశ్‌కు
ప్రత్యేక హోదా ఇస్తాం,
తీసుకొస్తాం అనగానే
2019లోనూ
ఓటేసేయబోకండి....

- ★ ప్రత్యేక హోదా అంటే ఏమిటి?
- ★ హోదా ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి ఎంత డబ్బుని, ఎంతకాలంలోగా తెస్తారు?
- ★ పారిశ్రామిక పన్ను రాయితీల్ని ఇతర రాష్ట్రాలతో సమస్యలు లేకుండా ఏ రకంగా సాధిస్తారు?

...తదితర అంశాలన్నిటినీ వివరంగా తెలుసుకున్నాకే, మీకు నిజాయతీగా నమ్మకం కలిగాకే సరైన అభ్యర్థికి, పార్టీకి ఓటు వేయండి.

ఏపీకి ప్రత్యేక హోదాకు సంబంధించి మీకు ఈ వివరాలన్నిటినీ ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్.డి.ఆర్)/లోక్‌సత్తా చొరవతో జేపీ కన్వీనర్‌గా స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) రూపొందించిన నివేదికలో అందుబాటులో ఉన్నాయి. ఇతర విభజన హామీలకు సంబంధించి కూడా కచ్చితంగా రావాల్సిన నిధుల వివరాలు, విధి విధానాలు ఇందులో ఉన్నాయి.

ఈ స్వతంత్ర నిపుణుల బృందం నివేదికను, రాజకీయ పార్టీల హామీల్ని పోల్చి చూసుకున్నాకే ఓటు వేయండి.

ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై మళ్లీ మోసపోకండి !

details @ www.fdrindia.org

# నోట్ల రద్దుపై చెబితే వింటేగా.. చివరకు ఉద్యోగాలు పోయె.. నల్లధనం మాత్రం కొనసాగె !



పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) ముందు ఆర్‌బీఐ హెచ్చరికను, నోట్ల రద్దు తర్వాత లోక్‌సత్తా చేసిన విస్పష్ట సూచనలనూ పట్టించుకోకపోవటం వల్ల మోదీ ప్రభుత్వం చేపట్టిన డీమానిటైజేషన్ ఓ భారీ తుగ్లక్ కార్యక్రమంలా మిగిలిపోయిందని, దేశంలో నల్లధనం, దానికి మూలమైన అవినీతి తగ్గలేదని ఇక ఇప్పుడు స్పష్టంగా తీర్మానించేయొచ్చు.

నోట్ల రద్దు ద్వారా నల్లధనానికి అడ్డుకట్ట వేయటం తమ ప్రధాన లక్ష్యంగా నవంబర్ 8, 2016న ప్రధాని మోదీ చాటుకున్నారు. కోట్లాది ప్రజలు కూడా నల్లధనం భరతం పట్టడానికి జరిగిన ఓ మహాప్రయత్నమన్న నమ్మికతోనే ఉపాధిని నష్టపోయినా భరించారు. నోట్ల రద్దు అమలును అసమర్థంగా అమలు చేయటం వల్ల.. అనారోగ్యాన్ని, వయోభారాన్నీ కూడా లెక్కచేయకుండా అనేకమంది కొత్త నోట్ల కోసం బ్యాంకుల వద్ద క్యూలలో రోజుల తరబడి నిలబడ్డారు. ప్రపంచ చరిత్రలోనే ఇన్ని కోట్ల మందిని ఇంత పెద్దఎత్తున ప్రభావితం చేసిన నిర్ణయం ఇటీవలి కాలంలో కనిపించదు. చివరికి నోట్ల రద్దు వల్ల నల్లధనం పెద్దగా బైటపడలేదు. కానీ 2017 నుంచి ప్రస్తుత 2019 సాధారణ ఎన్నికలు సహా అన్ని ఎన్నికల్లో మాత్రం నల్లధనం విశృంఖలంగా చెలామణి అవుతోంది.. ఈ విషయాన్ని తాము ముందుగానే హెచ్చరించామని, నోట్ల రద్దు వల్ల నల్లధనాన్ని నిర్మూలించటం పెద్దగా సాధ్యం కాదని ముందుగానే నరేంద్రమోదీ సర్కారుకు తెలియజేశామని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల తెలిపింది.


ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా డైరెక్టర్‌గా ఉన్న బోర్డు ఆనాటి సమావేశ వివరాలను వెంకటేష్ నాయక్

- 2016 నవంబర్ 8 నాటికి చెలామణిలో ఉన్న రూ.500, రూ.1000 నోట్ల విలువ రూ.15.41 లక్షల కోట్లు
- దేశీయులు 50 రోజుల్లోగా, ప్రవాస భారతీయులు 2017 జూన్ వరకు కలిపి బ్యాంకుల్లో జమ చేసిన రూ.500, 1000 నోట్ల విలువ రూ.15.31 లక్షల కోట్లు

స.హ చట్టం కింద కోరారు. దానిపై బ్యాంకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి:

- 2016లో రూ.500, 1000 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించటానికి కేవలం రెండున్నర గంటల ముందు మాత్రమే ఆర్‌బీఐ బోర్డు సమావేశమైంది.
- పెద్ద నోట్లు రద్దు చేయాలన్న ప్రభుత్వ వినతిని బోర్డు ఆమోదించింది. అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి శక్తికాంత దాస్, ఆర్థిక సేవల కార్యదర్శి అంజులి చిబ్ దుగ్గల్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్లు ఆర్.గాంధీ, ఎస్ఎస్ ముంద్రా ఈ సమావేశంలో పాల్గొన్నారు. (ప్రస్తుతం గాంధీ, ముంద్రా ఆర్‌బీఐ బోర్డులో లేరు. శక్తికాంత దాస్ ఆర్‌బీఐ గవర్నర్‌గా 2018 డిసెంబర్‌లో నియమితులయ్యారు).
- 'నల్లధనంలో అధికభాగం నగదు రూపంలో లేదు. అది స్థిరాస్తి, బంగారం వంటి రూపాల్లోకి మారి ఉంది. పెద్ద నోట్లు రద్దు చేయడం వల్ల, వాటిపై గణనీయ ప్రభావం ఏమీ పడదు. ప్రస్తుత (2016-17) ఆర్థిక సంవత్సర జీడీపీ వృద్ధిపై వ్యతిరేక ప్రభావం పడుతుంది' అని ఢిల్లీలో జరిగిన ఆర్‌బీఐ బోర్డు 561వ సమావేశం అభిప్రాయపడింది.
- నకిలీనోట్లు ప్రమాదకరమే అయినా, మొత్తం నగదులో కేవలం రూ.400 కోట్లకు సమానమైన మొత్తమే ఈ రూపంలో ఉన్నందున, గుర్తించదగ్గ అంశం కాదని తెలిపింది.

- వృద్ధి రేటు గణాంకాలు వాస్తవం. అయితే కరెన్సీ నోట్ల చెలామణిలో వృద్ధి నామమాత్రం గా ఉంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే, వ్యత్యాసం పెద్దగా ఉండక పోవచ్చు. అందువల్ల పెద్ద నోట్ల రద్దుకు సిఫారసు చేసేంతగా కారణాలు లేవని బోర్డు సమావేశం అభిప్రాయ పడింది.




ఆర్‌బీఐ ఈ విధంగా హెచ్చరించినా.. ప్రభుత్వం మాత్రం పెద్ద నోట్ల రద్దు వల్ల జీడీపీ వృద్ధిపై అధిక ప్రభావం ఏమీ ఉండదనే వాదించింది. దీంతోపాటు నగదు వాడకం, నగదు కలిగి ఉండటాన్ని తగ్గించడానికి చర్యలు చేపడతా మని కూడా హామీ ఇచ్చింది.

ఇదేవిధంగా పెట్రోల్ బంకులు సహా 23 రకాల వినియోగ బిల్లుల చెల్లింపునకు ఎన్ని రూ.500, 1000 నోట్లు వినియోగించారనే సమాచారం తమ వద్ద లేదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ రూపంలో కూడా పాత నోట్లు అత్యధికం గా బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగొచ్చాయన్నది వాస్తవం.

ప్రభుత్వ ఆస్పత్రులు, రైల్వే టికెట్లు, ప్రజా రవాణా, విమానాశ్రయాల్లో టికెట్ల కొనుగోలు, పాల బూత్‌లు, శ్మశానాలు, పెట్రోల్ పంపులు, మెట్రో రైలు టికెట్లు, డాక్టర్ చీటీతో ఔషధాల కొనుగోలు, వంటగ్యాస్ సిలెండర్లు, రైల్వే కేటరింగ్, విద్యుత్తు–నీరు బిల్లులు, జాతీయ రహదారుల టోల్ ప్లాజాలు, ఏఎస్ఐ స్మారకచిహ్నాల ప్రవేశ టికెట్ల కోసం 2016 డిసెంబర్ 16 వరకు పాత రూ.500 నోట్లను ప్రభుత్వం అనుమతించింది. అయితే నోట్ల మార్పిడికి వాడుకుంటున్నారనే ఫిర్యాదులతో పెట్రోల్ బంకులు, విమాన టికెట్ల కొనుగోలుకు అనుమతిని రద్దు చేస్తూ 2016 డిసెంబర్ 2న ఆ అనుమతిని ఉపసంహరించింది.

**రద్దును ప్రకటించాక..**


ఆర్‌బీఐ హెచ్చరికను పెడచెవిన పెట్టటం వల్ల మోదీ సర్కారు దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాన్యుడి ప్రయోజనాలకి నష్టం చేకూర్చటాన్ని అలా వుంచితే.. నోట్ల రద్దును ప్రకటించాక కూడా లక్ష్యాల్ని చేరుకునేందుకున్న అవకాశాలను వినియోగించుకోకుండా నష్టాన్ని అలాగే కొనసాగించేలా మోదీ వ్యవహరించారు. నోట్ల రద్దు తర్వాత లక్ష్యాల్ని చేరుకోవటానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రధాని మోదీకి లోక్‌సత్తా అందించింది.

'అయ్యా మోదీ గారూ! నల్లధనంపై నోట్ల రద్దు ద్వారా మీరో పెద్ద అడుగు వేశారు. అయితే నల్లధనాన్ని కట్టడి చేయటానికి అది సరిపోదు. మీరు అంత పెద్ద అడుగు వేయటంతోపాటు ప్రజల నుంచి కూడా అసాధారణ మద్దతు లభించింది కాబట్టి.. నల్లధనం, అవినీతి అంతానికి ఇవిగో ఈ నిర్దిష్ట చర్యలు చేపట్టండి' అని లోక్‌సత్తా సూచించింది. వాటినీ మోదీ నిర్లక్ష్యం చేశారు.

వెరసి, నోట్ల రద్దుకు ముందు, తర్వాత కూడా మోదీ ప్రభుత్వం సరైన సూచనల్ని, ఆలోచనల్ని పాటించకపోవడం వల్ల చివరకు సామాన్యుడికి కష్టాలు, నిరుద్యోగం మిగిలాయి తప్ప.. నల్లధనం, దానికి మూలమైన అవినీతి మాత్రం కట్టడి కాలేదు. ■

# బదిలీలు ఏకపక్షమైతే.. అపశ్రుతి దొర్లినట్టే

- **ఎన్నికల సంఘం జవాబుదారీగా ఉండాలి**
- **పోలింగ్‌కు ఎందుకంత సమయం?**
- **ఓట్ల తొలగింపు వైఫల్యమే**
- **ఓడినప్పుడే ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నారు**
- **'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్**



"ఒక పార్టీ చేసిన ఫిర్యాదును బట్టి, ఎలాంటి స్వతంత్ర విచారణ లేకుండా, సంబంధిత అధికారుల వివరణ తీసుకోకుండా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని అడగకుండా.. ఎన్నికల సంఘం ఏకపక్షంగా ఏపీ ఉన్నతాధికారులను బదిలీ చేసిందని వార్తలొస్తున్నాయి.. అదే నిజమైతే కచ్చితంగా అపశ్రుతి దొర్లినట్లే" అని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 'ఎన్నికల సంఘానికి స్వయంప్రతిపత్తి ఉంది. ప్రజలు, పార్టీలు, పత్రికలు దానికి మద్దతునిస్తున్నాయి. కోర్టులు అసాధారణ సమయాల్లో తప్ప జోక్యం చేసుకోకుండా గౌరవమిస్తున్నాయి. దాన్ని కాపాడుకోకుండా ఎవరో చేసిన ఫిర్యాదును బట్టి అధికారులపై చర్యలు తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి లేదు' అని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ఇచ్చిన విచక్షణాధికారాన్ని ఇష్టం వచ్చినట్లు వాడుకుంటాం.. మేమే రాజులం.. చక్రవర్తులం ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనుకుంటే పొరపాటని, కచ్చితంగా ప్రజాస్వామ్యానికి, న్యాయవ్యవస్థకు జవాబుదారీతనంగా ఉండాల్సిందేనన్నారు. ప్రభుత్వ అధికారుల వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తికి, ప్రజాస్వామ్యానికి, ఎన్నికల నిర్వహణకు ప్రమాదకరం అన్నారు. ఇప్పటికైనా పొరపాటును సరిదిద్దుకొని, ఘటనపై స్వతంత్ర విచారణ చేసి, పారదర్శక నిర్ణయం తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో తన నివాసంలో 'ఈనాడు-ఈటీవీ'కి ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో జేపీ మాట్లాడారు. ముఖ్యాంశాలివి:

### తొలగింపు దరఖాస్తులు పునరావృతం కావొద్దు

ప్రతి ఎన్నికల్లో నగర, పట్టణ ప్రాంతాల్లో 7-8 శాతం మంది అర్హత ఉన్నా ఓటు వేయలేకపోతున్నారు. లోక్‌సత్తా చేసిన పరిశీలనలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 8.4 శాతం ఓట్లు ఉండాల్సినవి లేకుండా పోయినట్లు గుర్తించాం. ఓటరు జాబితాతో ఇంటింటికెళ్లి 2217 ఓట్లను పరిశీలిస్తే, దానిలో 186 మంది ఓటు కోల్పోయారు. 272 మంది లేనివాళ్ల పేర్లు జాబితాలో ఉన్నట్లు తేలింది. ఇదంతా పొరపాటున జరిగిందా? కావాలని చేస్తున్నారా? అధికార యంత్రాంగం అవినీతా? అసమర్థతా? అనేది పక్కన పెడితే.. ఈ విషయంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైంది. ఓట్ల నమోదు, తొలగింపులు ఎన్నికల సంఘం చేతుల్లోనే ఉంది. ఇటీవల వివిధ పార్టీల తరపున కొన్ని ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు వచ్చాయి. ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకొని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఏం చేయాలో ఆలోచించాలి. తపాలా కార్యాలయాలను నోడల్ ఏజెన్సీగా పెట్టి ఓటర్ల నమోదు, తొలగింపు చేపట్టాలి. అలాంటి అవకాశాలు ఇవ్వకుండా ఎన్నికలు అయిపోయాక క్షమించండి..

## ఎన్నికలపై నమ్మకం పెరగాలి

ఈవీఎంలు, వీవీప్యాట్‌లు బాగానే పనిచేస్తున్నాయి. పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్నదానికి ఆధారాల్లేవు. ఆ భయాన్ని వదిలేసి.. ఎన్నికల నిర్వహణపై నమ్మకాన్ని పెంచుకోవాలి. ఇదే సమయంలో అనుమానాలున్న చోట కనీసం 5-10 శాతం వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించాల్సిన అవసరం ఉంది. ఆచరణ సాధ్యమైతే ఎన్నికల సంఘం ఈ విషయంలో ముందుకు వస్తుందనే నమ్ముతున్నా. ఓడిపోయిన ప్రతి పార్టీ ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నాయి. అదే యంత్రాలతో మళ్లీ గెలుస్తున్నారంటే వాటిని ట్యాంపర్ చేయడానికి ఆచరణలో వీలులేదనే విషయం స్పష్టం అవుతుంది.

## నిజామాబాద్‌లో 185 మందికి ఎన్నికలు పెట్టాల్సిందే

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బరిలో నిలిచిన 185 మందికి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు పెట్టాల్సిందే. ఇప్పుడు రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకత గతంలోనూ వచ్చినప్పుడు ఎన్నికలు జరిగాయి. అయితే ఎన్నికలపై ప్రభావం ఉంటుందని అనుకోవడం లేదు. భవిష్యత్తులో ఇలాంటివి జరగొద్దంటే పార్లమెంట్ బరిలో నిలిచేవారు ఐదు నుంచి పదివేల మంది ఓటర్ల సంతకాలు తీసుకురావాలనే నిబంధన పెట్టాలి. ఇది వీలుకాకుంటే ఆచరణ సాధ్యమయ్యే ప్రత్యామ్నాయాల దిశగా ఆలోచనలు చేయాలి.



పొరపాటైపోయిందని నాలిక కరచుకోవడం అలవాటైపోయింది. ఇతర దేశాల్లో మాదిరిగా ఎక్కడికక్కడ ఓటరు నమోదు విధానాన్ని మన దగ్గరా తీసుకురావాల్సిన అవసరం ఉంది. లోక్‌సత్తా తరపున ఎన్నిసార్లు కోరినా ఫలితం ఉండటం లేదు. నగర ప్రాంతాల్లో ఓటరు జాబితాలో అనేక అవకతవకలు భయంకరంగా ఉన్నాయంటే ఆ పాపం నూటికి నూరుశాతం ఎన్నికల సంఘానిదే తప్ప పార్టీలది, ప్రభుత్వానిది కాదు.

### ఎన్నికలకు అన్ని రోజులెందుకు

ఎన్నికల్లో విశృంఖల ధనప్రవాహం ఉందని తెలిసినా ఏం చేయలేక పోవడం.. చెల్లింపు వార్తలను పట్టించుకోకపోవడం ఎన్నికల సంఘం నిర్లక్ష్యానికి నిదర్శనం. చేయాల్సిన పనిని వదిలిపెట్టి పైపై ఆర్భాటాలకు పోతోంది. 1977లో జనతా ప్రభుత్వం వచ్చినప్పుడు కేవలం మూడు రోజుల్లో ఎన్నికలు అయిపోయాయి. దేశం మొత్తం చైతన్యం వచ్చి ప్రభుత్వమే మారిపోయిన అంతపెద్ద ఎన్నికలు మూడు రోజుల్లో అయిపోతే.. ఈసారి ఏడు విడతల్లో ఎన్నికలు ఎందుకో అర్థం కావడం లేదు. ఏప్రిల్ 11న ఎన్నికలైతే మే 23 వరకు ఫలితాలు రాకపోవడం ఏంటి? ఎన్నికలను సాగదీసి తమ ప్రాభవాన్ని చాటుకోవాలి, ప్రచారం చేసుకోవాలని తప్పితే సమర్థంగా, సజావుగా నిర్వహించాలనే విషయాన్ని గుర్తించడం లేదు. ఈ విషయంలో ప్రపంచంలోని ఇతర దేశాలను చూసి నేర్చుకోవాలి. ■

# ఆటగాళ్లు కాదు.. నియమాలు మారాలి!

- కూసంపూడి శ్రీనివాస్




సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడడంతో ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలూ అస్త్రశస్త్రాల్ని ప్రయోగిస్తున్నాయి. తెదేపా, బిజెపి, కాంగ్రెస్, వైకాపాలు ఒంటరిగా పోటీ చేస్తుంటే.. ఈసారి బరిలో ఉన్న జనసేన పార్టీ వామపక్షాలతో, బిఎస్పితో కలిసి పోటీ చేస్తోంది. త్రిముఖంగా కనిపిస్తున్న ఈ పోటీలో ఎవరికి వారు తాము అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే పనిలో తలమునకలై ఉన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూనే తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అయితే తమ నవరత్న పథకాలపైనే నమ్మకం పెట్టుకుంది. అధికార పార్టీ పథకాలతోను (స్కీములు), ప్రతిపక్ష పార్టీ పథకాలతోను (ప్లానులు) ఓటర్లకు గేలం వేస్తున్నాయి. ఇక జనసేన, వామపక్ష పార్టీలు, బీఎస్పీ అయితే అవినీతిరహిత సమాజ స్థాపన కోసం, రాజకీయాల్లో జవాబుదారీతనం కోసం కలిసి ఉమ్మడిగా ఎన్నికలకు వెళుతున్నట్లు ప్రకటించాయి. అశాస్త్రీయ విభజన కారణంగా రాష్ట్రంలో గత ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తోంది. ప్రత్యేకహోదా కోసం మొదటి సంతకం పెడతామని అధిష్టానం ప్రకటించడం తమకు కలిసొస్తుందని ఆ పార్టీ భావిస్తోంది.

ఈ రాజకీయాలను పక్కన పెడితే పార్టీలకు కూడా గెలుపు ఒక మార్గమే తప్ప లక్ష్యం కాదనే వాస్తవం ఈ ఎన్నికల్లోనూ మరుగునపడటం దురదృష్టకరం.

గెలుపు లక్ష్యం జనం జీవితాల్లో మార్పు కావాలి. కాకపోతే మనదేశంలో రాజకీయం ఎన్నికల చుట్టూ తిరిగే మహాడ్రామాగా మారిపోయింది. నాయకులు రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి, పాలనలో అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు కొందరు వ్యక్తుల, కుటుంబాల స్వంత ఆస్తులుగా మారిపోయాయి. కార్యకర్తలు కేవలం పల్లకీలు మోసే బోయీలుగా, జెండాలు పట్టే కూలీలుగా, బానిసలుగా మారిపోయారు. పార్టీలలో పదవులు కేవలం అధినాయకుల అండ ఉన్న కొంతమంది స్వంతం, నాయకత్వం కుటుంబ వారసత్వంగా సంక్రమించే హక్కుగా మారిపోయింది. చట్టాన్ని, రాజ్యాంగాన్ని నిలబెట్టవలసిన రాజకీయం వాటిని తుంగలో తొక్కుతున్నది. నేరస్తులు నాయకులుగా చెలామణి అవుతున్నారు. డబ్బు పంపిణీ, మద్యం సరఫరా లేకుండా, అక్రమార్జన లేకుండా, అసలు రాజకీయం సాధ్యమే కాదనే పరిస్థితిని ఈనాటి సాంప్రదాయ పార్టీలు కావాలని సృష్టించాయి. గొర్రెలను తినేవాడు పోతే బర్రెలను తినేవాడు వస్తాడనే చందాన రాజకీయాన్ని తయారుచేశాయి. నాయకులకు తోడు మన ఎన్నికల వ్యవస్థ కూడా అధ్వాన్నంగానే ఉంది. ఎవరికి ఒక ఓటు ఎక్కువ వస్తే వారే గెలిచినట్లు అన్న ఎన్నికల విధానం వల్ల అవాంఛనీయమైన పరిణామాలు వస్తున్నాయి. ఈ విధానంలో అభ్యర్థికి వచ్చిన మొత్తం ఓట్లకు గానీ, పార్టీకి వచ్చిన మొత్తం ఓట్లకు గానీ ఎటువంటి ప్రాధాన్యతా లేదు. కావాల్సిందల్లా ప్రత్యర్థికన్నా ఒక్క


ఓటైనా అధికంగా సంపాదించడం. అభ్యర్థి విజయం సాధించాలంటే ఈ అదనపు ఓటు రాబట్టుకోవడానికి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగా ఓట్లు కొనుగోలు చేస్తున్నారు. ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేయకపోతే కనీసం 40 శాతం కూడా ఓటింగ్ జరిగే అవకాశం కనిపించడం లేదు. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అన్న విధానంలో ఇద్దరు ప్రధానమైన అభ్యర్థులకు, రెండు ప్రధాన పార్టీలకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. ఈ పరిస్థితి వలన రాజకీయ పార్టీలు కూడా ఏదో రకంగా అదనపు ఓట్లను రాబట్టగలిగే అభ్యర్థులను మాత్రమే పోటీ చేయిస్తున్నాయి. ఓట్లు కొనడం కోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టేవారు కానీ, లేదా ఆ నియోజకవర్గంలో ఆధిపత్యంలో ఉన్న కులనాయకుడిగా ఎదిగినవారు కానీ, లేదా కండబలం చూపగలిగే రౌడీలు, గూండాలు మాత్రమే రాజకీయ పార్టీలకు మెరుగైన అవకాశాలు ఉన్న అభ్యర్థులుగా కనిపిస్తున్నారు. అందులోనూ మనదేశంలో రాజకీయాలు లాభసాటి వ్యాపారం. స్వల్పకాలంలో నైపుణ్యంతో శ్రమించకుండా, అత్యధికంగా సంపాదించాలంటే ఏదో ఒక పార్టీ నుంచి గెలవాలి. అందుకే కోట్లాది రూపాయలు ఇచ్చి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కొనుక్కుంటున్నారు. ఇలా సీట్లు గెలిచినవారు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతినిధులు కావడం అపచారమే అవుతుంది. పోనీ గెలిచిన వారయినా అదే పార్టీలో ఉంటున్నారా అంటే అదీ లేదు. అధికార పార్టీ ఇచ్చే తాయిలాలకు ఆశపడో, లేదా బెదిరింపులకు భయపడో పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారు. అసాధారణ నిర్ణయాధికారాలను స్పీకర్‌కు కట్టబెట్టడం వలన పార్టీ ఫిరాయింపు చేసినవారు రాజీనామా చేసినా స్పీకర్లు ఆమోదించని రోజులివి. చట్టాల్లో ఉన్న లసుగులను ఆసరాగా చేసుకుని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి మంత్రులుగానూ చెలామణి అవుతున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి నాయకులకు ప్రజా జీవితాలతో, ఉద్యమాలతో ఏదోకరూపంలో సంబంధం ఉండేది. కానీ నేటి నాయకులకు రాజకీయ ఆదర్శం గానీ, దూరదృష్టి గానీ, ప్రజల సమస్యల పట్ల శ్రద్ధ గానీ లేవు. కేవలం ఒక్క అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు తమ సిద్ధాంతాలు నచ్చి వచ్చారని, తమ నుంచి వెళ్లిపోయిన వారు ద్రోహులని అనడం రివాజుగా మారిపోయింది. ప్రతీసారి ఆటగాళ్లు మారుతున్నారు తప్ప, ఆటనియమాలు మాత్రం మారడం లేదు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఎప్పుడూ ప్రజలే ఓడిపోయే పరిస్థితి వచ్చేసింది.

నిజానికి రాజకీయాన్ని మార్చడంలో, పరిపాలనని బాగుచేయడంలో, ప్రజల ఆశలను నెరవేర్చడంలో ఏ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందో అటువంటి పార్టీనే ప్రజలు మనసుల్లో కోరుకుంటున్నారన్నది రాజకీయనేతలు గుర్తించడం లేదు. అందుకే తాము అవినీతికి పాల్పడుతూ, సంక్షేమం పేరుతో పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే విధానాలను అమలు చేస్తూ తాయిలాల్ని, ఉచితాల్ని, డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలను పంచుతూ గెలవడం ఒక సౌకర్యవంతమైన ఫార్ములాగా నేతలు భావిస్తున్నారు. మేనిఫెస్టోల రూపంలో ఇచ్చే హామీలు, వాగ్దానాలు, చేసే యాత్రలు.. అన్నీ పౌరుల కోణం నుంచి కాక పదవీకాంక్షతో చేస్తున్నారు. నిజానికి కొంతకాలం భ్రమల్లో ముంచెత్తి, తరువాత చేదు నిజాలను చవిచూపించే తాత్కాలిక వరాలను, జనాకర్షక పథకాలను ప్రజలు ఎవరూ కోరుకోవడం లేదు. తమ సమస్యలను చిత్తశుద్ధితో, నిజాయతీతో, శాశ్వతంగా పరిష్కరించేవారు కావాలని వారు అస్పష్టంగానైనా ఆకాంక్షిస్తున్నారు.

ఈ నీతిమాలిన వ్యవహారాలకు స్వస్తి పలకాలంటే రాజకీయ, ఎన్నికల వ్యవస్థల్లో మౌలిక మార్పులు వస్తే తప్ప ఈ భ్రష్టుపట్టిన రాజకీయ సంస్కృతి మారదు. అందుకే ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థని ప్రక్షాళన చేయాలి. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవడం లాంటి సంస్కరణలు చేపట్టాలి. ఎన్నికలు ప్రజల భవిష్యత్తును, రాజ్యవ్యవస్థ నడిచే తీరును నిర్ణయించే ప్రక్రియగా మారాలి. రాబోయే ఎన్నికలను మూడో అంచె స్థానిక ప్రభుత్వాలకు బాధ్యతలను బదిలీ చేసే ఫెడరల్ వ్యవస్థ విస్తరణకు, విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచడానికి సరైన అవకాశంగా మనం మలచుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధాన ఆయుధమని, ఓటరుకు ఓటు విలువ తెలియకుండా సమాజంలో మార్పు రావడం అసాధ్యమని ప్రజలు గ్రహించాలి. అంతేకాదు, రాజకీయ క్రీడలకు బలికాకుండా, వ్యక్తిపూజలకు దూరంగా ఉంటూ, మోసం చేసినవారికి కీలెరిగి వాతపెడుతూ, విధానాలు, అభ్యర్థుల విశ్వసనీయ చరిత్ర ఆధారంగా వచ్చే ఎన్నికల్లో నిర్మొహమాటంగా ఓట్లు వేయడమే ప్రజలు చేయాల్సిన పని. ■

# ప్రజామేధావి హెబర్‌మాస్

**విభేదించటం విద్రోహమనే ధోరణులు మన సమాజంలో ప్రబలుతున్న సందర్భమిది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో ప్రజాస్వామ్య సమాజ పునర్నిర్మాణానికి నిబద్ధమైన ప్రజామేధావి హెబర్‌మాస్ గురించి మన తరం భారతీయ ప్రజామేధావులలో ఒకరైన రామచంద్ర గుహ రాసిన క్లుప్త పరిచయ వ్యాసమిది.**




'సమాజ జీవితంలో న్యాయవిరుద్ధ పరిస్థితులు, పరిణామాల పట్ల మేధావి ఆందోళన చెందాలి. ఆగ్రహించాలి. ఈ మానవతా ప్రతిస్పందన అనేది మేధావి విద్యుక్త ధర్మం. అయితే ఈ ధర్మనిరతి మితిమీర కూడదు. ధర్మాగ్రహం ఎప్పుడూ సంయమన రీతిలోనే ఉండాలి. అలా ఉండాలంటే మేధావికి తగినంత రాజకీయ వివేచన ఉండాలి' – జర్మన్ తాత్వికుడు, సామాజిక సైద్ధాంతికవేత్త యుర్గెన్ హెబర్‌మాస్ వివేక వచనాలివి. చాలా చక్కగా చెప్పిన చిర సత్యాలు కూడా. సమకాలీన పాశ్చాత్య ప్రపంచ మేధావులలో హెబర్‌మాస్ అగ్రగణ్యుడు. ఆయన జీవితం, మేధోకృషిపై ఇటీవల వెలువడిన ఒక స్ఫూర్తిదాయక పుస్తకం నుంచి పై మాటలను ఉటంకించాను.

అన్యాయ, అసమ, అనుచిత సమాజాలలో నివసిస్తున్న మేధావులు అప్పుడప్పుడూ ఆగ్రహించడం అనివార్యం. అయితే వారు తమ ప్రాథమిక కర్తవ్యాన్ని ఎట్టి పరిస్థితులలోను విస్మరించకూడదు. త్యజించకూడదు. మేధావులు వివేచనాపరులు! విశ్వాసులు ప్రచారకులు మాత్రమే. సత్యానికే సదా ప్రాధాన్యమిస్తారు మేధావులు. సత్యశోధకులు, సత్యావిష్కర్తలు వారే. విశ్వాసులు (ఏ మతం లేదా భావజాలం వారైతేనేమి)కు ఈ ప్రవృత్తి, నిష్పాక్షిక దృష్టి ఉండదు. కనుకనే విశ్వాసులు తరచు దూషణలు, ఖండనలకు పాల్పడటం కద్దు. విచారకరమైన విషయమేమిటంటే వామపక్ష మేధావులు సైతం–మార్క్సిస్టులు, ఎడ్వర్డ్ సైద్ అనుయాయులైన ప్రాచ్యవాదులు, మరీ ముఖ్యంగా ఇటీవలి కాలంలో అంబేద్కర్‌వాదులు–విశ్వాసుల తరహాలోనే వ్యవహరించడం పరిపాటి అయింది.

హెబర్‌మాస్ జీవితచరిత్రకారుడు, ఆయన విస్తృత విద్యాకుటుంబసభ్యుడైన స్టెఫాన్ ముల్లెర్–డూమ్ (ప్రస్తుతం ఓల్డెన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర ఆచార్యులు) సమగ్ర పరిశోధనతో, సావధానంగా రాసిన గ్రంథమది. హెబర్‌మాస్ వ్యక్తిగత జీవిత వివరాలను పూర్తిగా విస్మరించకుండా ఆయన మేధోకృషికి ప్రాధాన్యమిస్తూ రాసిన జీవిత చరిత్ర అది. హెబర్‌మాస్ 1929లో జన్మించారు. ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసినప్పుడు ఆయన వయస్సు 16 సంవత్సరాలు. చిన్నవయస్సులో ఉన్న కారణంగా నాజీ పాలకులు ఆయన్ని నిర్బంధ సైనిక సేవలకు ఉపయోగించుకోలేదు. అయితే ఈ పదహారేళ్ల బాలుడు, ఆనాటి అడాల్ఫ్ హిట్లర్ దుర్మార్గ పాలన బీభత్సాలను ప్రత్యక్షంగా చవిచూశాడు. జర్మనీలోనేకాదు, యూరప్‌లో మరెక్కడా, ఆ మాటకొస్తే మానవ సమాజాలన్నిటా నాజీ నియంతృత్వ పాలన అమానుషాలు పునరావృతం కాకుండా నిరోధించడానికే ఆ బాలుడి మేధో జీవితం నిబద్ధమయింది.

గొట్టింజెన్, బాన్ విశ్వవిద్యాలయాలలో హెబర్‌మాస్ విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఫ్రాంక్‌ఫర్ట్‌లో థియోడర్ అడోర్నో, మాక్స్ హార్క్‌హెయిమెర్ మొదలైన విమర్శనా సిద్ధాంతకర్తల సహచర్యంలో ఆయన పరిశోధనా వ్యాసంగాలు జరిగాయి. పిదప కొంతకాలం మ్యూనిక్‌లోని ఒక పరిశోధనా సంస్థలో హెబర్‌మాస్ మేధో కృషి సాగింది. అంతిమంగా ఫ్రాంక్‌ఫర్ట్‌కు తిరిగివచ్చి అధ్యాపక జీవితంలో ఆయన స్థిరపడ్డారు. గురువుగారి ప్రధాన గ్రంథాలతో పాటు ఆయన

వివిధ సందర్భాలలో వెలువరించిన ఉపన్యాసాలు, వార్తాపత్రికలలో రాసిన వ్యాసాలు మొదలైన వాటన్నిటిపైనా స్టెఫాన్ నిశిత దృష్టి పెట్టారు. విశ్వవిద్యాలయాలకు వెలుపల సామాన్య విద్యావంతులకు సైతం సుపరిచితుడైన మేధావి గనుక వివిధ సమయోచిత మేధో చర్చలలో హెబర్‌మాస్ వాదాలు, ప్రతిపాదనలను కూడా స్టెఫాన్ శ్రద్ధగా విశ్లేషించారు.

హెబర్‌మాస్ జీవితం, మేధో కృషిలో ఆయన సతీమణి వెస్సెల్ హాఫ్ట్ నిర్వర్తించిన పాత్రను స్టెఫాన్ సవివరంగా తెలియజేశారు. తన కథానాయకుని జీవితం, ఆయన మేధో దృక్పథం మధ్య ఉన్న ఆసక్తికర సంబంధాలపై కూడా స్టెఫాన్ వెలుగులు ప్రసరించారు. హెబర్‌మాస్ అంగిట్లో తొర్రి బాధితుడు. దీన్ని సరిదిద్దడానికి బాల్యంలో హెబర్‌మాస్‌కు అనేక శస్త్రచికిత్సలు జరిగాయి. ఈ శస్త్రచికిత్సల బాధాకర అనుభవాలతో మానవులు పరస్పరం ఒకరిపై ఒకరు ఎలా ఆధారపడివుంటారో ఆ చిరుప్రాయంలోనే హెబర్‌మాస్‌కు తెలిసివచ్చింది. మానవ మస్తిష్కపు అంతర్ ఆత్మాశ్రయ నిర్మాణాన్ని నొక్కిచెప్పే దృక్పథాలను తాను ఆమోదించడంలో తన చిన్ననాటి శస్త్రచికిత్సల అనుభవాలు విశేషంగా దోహదం చేశాయని హెబర్‌మాస్ స్వయంగా చెప్పుకున్నారు.

ఇరవయ్యో శతాబ్ది ద్వితీయార్థంలో ప్రపంచ మేధావులను ప్రగాఢంగా ప్రభావితం చేసిన సామాజిక సైద్ధాంతికవేత్త హెబర్‌మాస్ అని చెప్పడానికి సహేతుక కారణాలు ఉన్నాయి (ఈ మేధో గౌరవంలో ఆయన ప్రత్యర్థి ఫ్రెంచ్ ఆలోచనాపరుడు మిషెల్ ఫూకో). హెబర్‌మాస్ ఒక అనుపమాన దేశభక్తుడు. ఎటువంటి సంకుచితత్వం లేని దేశభక్తి అది. యుద్ధోన్మాదం ఇసుమంతైనా లేని జర్మన్ దేశభక్తుడు హెబర్‌మాస్. రెండో ప్రపంచ యుద్ధానంతరం పశ్చిమ జర్మనీలో ప్రజాస్వామిక సమాజ పునర్నిర్మాణ మహోదాత్త ఆశయానికి హెబర్‌మాస్ అచంచలంగా నిబద్ధమయ్యారు. అయినప్పటికీ ప్రభుత్వ విధానాలు, రాజకీయ నాయకుల విపరీత ధోరణులను విమర్శించడానికి ఆయన ఏనాడూ వెనుకాడలేదు. హెబర్‌మాస్ భావాలు 'పబ్లిక్ స్ఫియర్' (వ్యక్తులు ఎటువంటి నిర్బంధం లేకుండా ముందుకువచ్చి కలసికట్టుగా స్వేచ్ఛాయుత చర్చలతో సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి నేపథ్యాలను పరిశోధించి, పర్యవసానాలను పర్యాలోచించి, రాజకీయ కార్యాచరణను ప్రభావితం చేయడానికి దోహదపడే సామాజిక జీవిత రంగం). 'కమ్యూనికేటివ్ యాక్షన్' (పరస్పరం చర్చలు, వాద ప్రతివాదాల ప్రాతిపదికన వ్యక్తులు చేపట్టే సహకారపూరిత కార్యాచరణ), 'కాన్‌స్టిట్యూషనల్ పేట్రియాటిజం' (రాజ్యాంగబద్ధ దేశభక్తి-ఒక జాతీయ సంస్కృతికిగానీ లేదా విశ్వజనీన సమాజానికిగానీ కాకుండా బహుత్వవాద ఉదార ప్రజాస్వామిక రాజ్యాంగ ప్రమాణాలు, విలువలతో మమేకమై రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకోవడం) మొదలైనవి దేశదేశాల్లో ప్రజాస్వామ్య సమాజాల నిర్మాణానికి అంకితమయిన చింతనాపరులు, రాజకీయ కార్యకర్తలకు వినూత్న స్ఫూర్తినిచ్చాయి.

2004లో హెబర్‌మాస్ అమృతోత్సవాలు (75వ జన్మదిన వేడుకలు) జర్మనీ, యూరోపియన్ దేశాలలో ఘనంగా జరిగాయి. ఆ సందర్భంగా ఆయన్ని, కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ నీషే, మార్టిన్ హైడెగ్గర్‌ల అనంతరం అత్యంత ప్రభావశీల జర్మన్ దార్శనికుడిగా కొనియాడారు. ప్రజల అంత:కరణగా ఉంటూ రాజకీయ సంస్కృతిలో ప్రజావివేకం సంపూర్ణంగా పరిఢవిల్లేందుకు దోహదం చేస్తున్న మేధావిగా ఆయన ప్రశంసలందుకున్నారు. హెబర్‌మాస్ మధ్యేమార్గ వామపక్షవాది. ప్రజాజీవిత పరిణామాలపై సునిశ్చిత ప్రగతిశీల భావాలతో, అయితే సంయమన పూరితంగా స్పందించే జ్ఞాని. అయినా అటు వామపక్షవాదులు, ఇటు మితవాదులు ఆయన్ని తీవ్రంగా విమర్శించడం కద్దు. 1970వ దశకం తుది సంవత్సరాలలో జర్మనీలోని వామపక్షాలు, వామపక్ష భావజాలం మద్దతుదారులపై తీవ్ర దాడులు జరిగాయి. జర్మన్ జాతికి వారు వ్యతిరేకులనే ఆరోపణ మోపారు. మితవాద మేధావులయితే హెబర్‌మాస్ వంటి సామాజిక ప్రజాస్వామ్యవాదిని సైతం మావోయిస్టు విప్లవకారులతో కలగలిపి తీవ్ర విమర్శలకు పాల్పడ్డారు. ఈ వివేకరహిత ధోరణులకు హెబర్‌మాస్ ఇలా ప్రతిస్పందించారు: 'వామపక్ష మేధావులను జాతి ఆంతరంగిక శత్రువులుగా నిందిస్తున్నారు. బహిరంగంగా ఆ మేధావుల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించి వారిని నైతికంగా తటస్థీకరిస్తున్నారు. ఇవెలాంటి చర్యలు? ఈ జాతి క్షేమానికి దోహదం చేసేవి కానేకావు. జర్మన్ గణతంత్ర రాజ్య అస్తిత్వానికి ముప్పు ఏర్పడితే సమర్థంగా ఎదుర్కోగలిగే భావసారూప్యత గల వ్యక్తుల సంఘటిత మైత్రిని ఆ సంకుచిత చర్యలు బలహీనపరచడం లేదూ?

ఈ జర్మన్ ప్రజా మేధావి హితవును మరోసారి జాగ్రత్తగా చదవండి. ఆ వివేకవాణి, ఇప్పుడు మన సమాజంలోని పరిణామాలకు వ్యతిరేకంగా మనలూ జాగృతం చేస్తోంది మరి. ఆనాటి జర్మన్ సంకుచితపరుల మాదిరిగానే నేడు మనదేశంలో భక్తులు స్వతంత్ర మేధావులను 'జాతి వ్యతిరేకులు'గా, 'నగర నక్సలైట్లు'గా దూషిస్తున్నారు. వారిపై దాడులు, దౌర్జన్యాలకు

పాల్పడుతున్నారు. తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ఉత్కృష్ట బోధన, పరిశోధనా ప్రమాణాలతో విద్యావ్యాసంగాలకు నెలవుగా ఉన్న విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలను తమ స్వార్థప్రయోజనాలకు నిస్తేజం చేస్తున్నారు. నిజమైన విద్యా వెలుగులకు ఆస్కారం లేకుండా చేస్తున్నారు. 1995లో హెబర్‌మాస్‌ను ఒక సుప్రసిద్ధ ఇటాలియన్ మ్యాగజైన్ సంపాదకవర్గం ఇంటర్వ్యూ చేసింది. ఇటాలియన్లు ఇలా ప్రశ్నించారు: 'చరిత్రలో మౌలిక మార్పులు చోటు చేసుకున్న ఈ కాలంలో ఒక జర్మన్‌గా ఉండడం మీకేమనిపిస్తుంది? జర్మన్ అస్తిత్వం సూచిస్తున్నదేమిటి? నిర్దేశిస్తున్నదేమిటి? మీ దృష్టిలో వాటి ప్రాధాన్యమేమిటి?' హెబర్‌మాస్ ఇలా సమాధానమిచ్చారు: '1989లో చరిత్ర మేలిమలుపు తిరిగింది (సోవియెట్ సామ్రాజ్యం పతనమై కాలంలోకి జారిపోయింది). అదొక శుభ పరిణామం, మహత్తర విముక్తిదాయక, ఆనందకర చారిత్రక స్ఫూర్తి. సరే, 1945 (నాజీయిజం అంతిమంగా ఓడిపోయిన సందర్భం) చారిత్రక గుణపాఠాలు నేర్పింది. జర్మన్ల భావి చారిత్రక ప్రస్థానాన్ని నిర్దేశించింది. అదొక జ్ఞానదాయక చరిత్ర. 1989 చారిత్రక విజయం, 1945 నిర్దేశించిన గుణపాఠాలను ఎట్టి పరిస్థితులలోనూ విస్మరణకు లోనుకాకుండా చేయాలి. జర్మన్ అస్తిత్వం నిర్దేశిస్తున్న కర్తవ్యమిది'. మన దేశ చరిత్రలోనూ ఇటువంటి ఉపయుక్త తేదీలు బహుశా 1977, 1980గా భావించవచ్చు. 1977ను ఒక శుభ సంవత్సరంగా మనం గుర్తుపెట్టుకొని తీరాలి, ప్రజాస్వామ్య శక్తుల కూటమి ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని ఓడించింది. అయితే 1980 గుణపాఠాలను మనం ఎట్టి పరిస్థితులలోనూ విస్మరించకూడదు. జాతి హితానికి కంటే స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం వల్ల నెలకొన్న గందరగోళ పరిస్థితులలో ప్రజాస్వామిక శక్తులు తమకుతామే నిర్వీర్యమై ఇందిరాగాంధీ మళ్లీ అధికారానికి రావడానికి దోహదం చేశాయి!

స్టెఫాన్ రాసిన హెబర్‌మాస్ జీవిత చరిత్రను చదివిన తరువాత ఏదో ఒక రోజు మన అమర్త్యసేన్‌కు కూడా ఇలాంటి జీవిత చరిత్ర రావాలనే కోరిక కలిగింది. ఈ ఇరువురి మేధో సంపన్నుల జీవితాలలో గమనార్హమైన పోలికలు ఉన్నాయి. హెబర్‌మాస్, అమర్త్యసేన్ లిరువురూ అనేక శాస్త్రాలలో నిజమైన నిష్ణాతులు. ఇరువురూ ప్రజామేధావులు. స్టెఫాన్ ఒక మేధావి జీవిత చరిత్ర రాశారు. ఆ పుస్తకం నుంచి నేను చాలా తెలుసుకున్నాను. అమర్త్యసేన్ మేధో కృషి మరెన్నో సంవత్సరాలు ఫలవంతంగా కొనసాగాలని కోరుకుంటున్నాను. ఆయనకు సరైన జీవిత చరిత్రకారుడిని కనుగొనాలని అభిలషిస్తున్నాను. ఆ జీవిత చరిత్రకారుడు తత్త్వశాస్త్రంలో విపుల పరిజ్ఞానమున్న ఆర్థికవేత్త అయి ఉండాలి. అంతేగాక అతడు అమర్త్యసేన్ శిష్యుడై ఉండకూడదు. బెంగాలీ అంతకన్నా కాకూడదు. ■

*(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)*

# అంబేద్కర్‌కి నిజనివాళి ఈ ఆలోచనల ఆచరణే: జేపీ

- ■ పుట్టుకతో వివక్షను తొలగించేందుకు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించే వ్యవస్థను నిర్మించటం
- ■ బంద్‌లు, రాస్తారోకోలు, ఆమరణ నిరాహారదీక్షలు వంటి వలస పాలననాటి పద్ధతుల ద్వారా కాకుండా.. స్వతంత్ర భారత రాజ్యాంగం ఆయుధంగా పాలకుల విధానాలపై పోరాడటం
- ■ కులం గుర్తులైన చౌదరి, రెడ్డి, నాయుడులాంటి పదాల్ని పేర్లలో నుంచి తొలగించటం
- ■ కులాంతర, మతాంతర వివాహాలను మన ఇళ్లల్లో ఆచరించి చూపటం
- ■ కులం, మతం, ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా సామర్థ్యాన్ని, విలువల్ని బట్టి మనిషిని అంచనా వేసే జాతి నిర్మాణం చేయటం

*(ఏప్రిల్ 14 బాబాసాహెబ్ జన్మదినోత్సవం)*



# క్లారిటీతో కలసి పనిచేయటం నేర్చుకుంటే.. యువతదే భవిష్యత్తు



క్లారిటీతో కలసి పనిచేయటం నేర్చుకుంటే యువతదే ఈ దేశ భవిష్యత్తు అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు.

కడప జిల్లా సీకే దిన్నె మండలంలోని ఊటుకూరు వద్ద గల టర్నింగ్ పాయింట్ శిక్షణా సంస్థలో జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా.. 'విద్యాప్రమాణాలు-ఉపాధి అవకాశాలు' అంశంపై విద్యార్థులు, యువతతో ఆయన సమావేశమయ్యారు. చర్చించటం, ప్రశ్నించటంతోపాటు యువత అడిగిన పలు ప్రశ్నలకు జయప్రకాష్ నారాయణ్ జవాబులిచ్చారు.

సమాజంలో ఏదోక మార్పు వస్తూనే ఉంటుందని, కానీ మనం ఆశించిన మార్పు వేగంగా సకాలంలో జరగాలంటే చదువుకున్న యువత చొరవతో సాధ్యమవుతుందని జేపీ అన్నారు. సరైన మార్పునకు యువభారత్ చక్కటి అవకాశమన్నారు. అలాగే ఎలాంటి మార్పు వచ్చినా దాని ఫలితాల్ని అనుభవించాల్సింది కూడా యువతేనన్నారు. అందుకే

## ప్రభుత్వోద్యోగాల కోసం అంతగా ఎగబడొద్దు, ఆత్మహత్యలపై ఎక్కువ చర్చ ప్రమాదకరం

సమాజంలో ప్రస్తుతం చదువుతున్న చదువుకు, ఉద్యోగాలకు పొంతన లేకుండా ఉందని, అలాగే యువతపై ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని జేపీ అన్నారు. ఆత్మహత్యల గురించి చర్చించటం సమాజానికి ప్రమాదకరమని, ఒత్తిడి తగ్గించుకునేలా వ్యవహరించమని, అవగాహన పెంచుకొమ్మని మాత్రమే తాను సూచిస్తున్నానని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం రావాలనుకోవటంలో తప్పులేదని, కానీ లక్షమంది నిరుద్యోగులకు 50 ప్రభుత్వోద్యోగాలే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం పని ఉద్యోగాలు వచ్చే వసతుల్ని కల్పించటం, విద్యను అందించటం తప్ప.. ఉద్యోగాలివ్వటం కాదని మనం స్పష్టంగా గుర్తించాలన్నారు. అందుకే ప్రైవేటు ఉపాధి, సొంతంగా ఉద్యోగాలిచ్చేలా ప్రయత్నించటం మీద యువత దృష్టిపెట్టాలన్నారు.

### బిడియం బతుకులు వద్దు

పిల్లల పెంపకం తీరులో మార్పు రావాలని జేపీ అన్నారు. ఆడమగ తేడాలేకుండా పిల్లల్ని పెంచాలన్నారు. తల్లిదండ్రుల పెంపకం ఈరకంగా ఉంటే.. చాలాచోట్ల బాలికలపై వేధింపులు ఉండవన్నారు. ఆడపిల్లల్ని కూడా బాగా చదివించి ప్రోత్సహిస్తే కుటుంబానికి, దేశానికి కూడా శక్తినిస్తారన్నారు. బిడియం లేకుండా ఆత్మవిశ్వాసంతో వ్యవహరించటం పిల్లలకు నేర్పించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా విస్తరిస్తున్న సమాజంలో బిడియం వదిలితే వేగంగా ఎదగగలరన్నారు.

సమాజాన్ని కొత్తతరం బాగా పట్టించుకోవాలన్నారు.

వ్యక్తుల మీద కాకుండా సమాజంలో మార్పు కోసం మనం పోరాటం చేయాలని జేపీ సూచించారు. యువత, మధ్యతరగతి, దళితులు, పేదలు, రైతుల మీద సమాజంలో మార్పు ఆధారపడి ఉంటుందన్నారు. ఈ రకంగానే వినూత్న రీతిలో మొబైల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సురాజ్య యాత్రను రూపొందించా మన్నారు. సురాజ్య యాత్ర లక్ష్యాలన్నీ తెలిగ్గా పెద్దమార్పును తేగలిగేవన్నారు. లంచంలేని ప్రభుత్వ సేవలు, లాభసాటి వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, చట్టబద్ధపాలన అనేవి సురాజ్య లక్ష్యాలని వివరించారు. ఆ పార్టీ, ఈ పార్టీ, ఆ నాయకుడు, ఈ నాయకుడి కొడుకు అని కాకుండా.. ఈ లక్ష్యాల కోసం కృషి చేస్తే తెలుగునాట, దేశంలో యువత, ఇతర వయసుల ప్రజలకు ఎక్కువ లాభం చేకూరు తుందన్నారు.

నాలుగు గోడల మధ్య చదువు అవసరమేనని, అదే సమయంలో ఆ గోడలకు ఆవల ఉన్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలని జేపీ అన్నారు. చదివిన చదువును

### ప్రతి పనికీ గడువు పెట్టాలి

మనం ఫీజు కట్టి మరీ పనులకు దరఖాస్తులు చేసుకుంటుంటే, వాటికి లంచాలడగటం ప్రజాస్వామ్యం అనిపించుకోదని జేపీ అన్నారు. హక్కుగా అందాల్సిన అలాంటి సేవలకు ప్రభుత్వ కార్యాలయాల్లో గడువు పెట్టాల్సిందేనన్నారు. ఆ గడువులోగా ప్రజలకు పనిచేసిపెట్టకపోతే ప్రభుత్వమే పరిహారం రోజుకింతని చెల్లించాలన్నారు. ఇందుకోసమే లోక్‌సత్తా పౌర సేవల చట్టాన్ని రూపొందించి ప్రభుత్వాలకు అందించిందన్నారు.

### మన డబ్బంతా ఎన్నికలకు, పెళ్లిళ్లకే వృధా చేస్తున్నాం

మనం నానా రకాలుగా సంపాదిస్తున్న డబ్బంతా ఎన్నికలకు, పెళ్లిళ్లకే వృధా చేస్తున్నామని జేపీ అన్నారు. దీనిపై ఆత్మపరిశీలన కావాలన్నారు. ప్రతి పనినీ గౌరవంగా భావించటం, కష్టపడి సంపాదించటం, ప్రతి రూపాయినీ సద్వినియోగం చేయటం అలవాటు చేసుకోవాలన్నారు.

సమాజంతో అనుసంధానం చేసి పరిష్కారాలు రూపొందించకపోతే.. ఉపయోగం ఏముంటుందన్నారు. సమాజంతో అనుసంధానమైన చదువు, సమాజానికి ఉపయోగపడే నైపుణ్యం ఉంటే జీవితంలో తిరుగులేకుండా ఎదగొచ్చన్నారు.

శైలజ, అంజనీదేవి, జ్యోత్స్న, మాళవిక, నాగేంద్రరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు.

టర్నింగ్ పాయింట్ అధినేత ఉత్తమ్‌రెడ్డి, లెక్కల జమాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పీఏసీ నేత ఎం.శ్రీకాంత్‌రెడ్డి, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, జగన్నాథరావు, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ■



**"విధ్వంసకర శక్తి కంటే సమీకరణ శక్తి గొప్పది"**

**- మహాత్మాగాంధీ @ 150**



# ఇతరులతో ఎలా ప్రవర్తించాలో కూడా నేర్పించలేకపోతున్న చదువులు

నేటి చదువుల్లో ఆదాయాన్ని సంపాదించుకోవటానికి కావలసిన నైపుణ్యాలు, ఆనందంగా బతకటానికి కావలసిన సాధారణ పరిజ్ఞానం రెండూ ఉండటం లేదని... నైపుణ్యాలూ అబ్బక, ఆనందమూ లేక ఇంక వారికి ఏమి బోధిస్తున్నట్లని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు.

'ప్రపంచ ఆనంద దినోత్సవం' సందర్భంగా డాక్టర్ రావూస్ ఫౌండేషన్, ఎమెస్కో ప్రచురణలు, తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) సంయుక్తంగా హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ఆనందదాయకమైన చదువు - పిల్లల్లోని అంతర్గత సామర్థ్యాలను వెలికితీయడంలో దాని పాత్ర' అంశంపై చర్చావేదిక నిర్వహించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, చదువుల్లో ఒత్తిడి మనదేశంలో పెద్ద సమస్యగా ఉందన్నారు. ఒత్తిడి వల్ల పిల్లల్లో మానసిక ఎదుగుదల కొరవడుతోందని, ఇంతచేసినా చదువులు రావటం లేదని అన్నారు. తెలంగాణలో ఇటీవల సర్వే చేస్తే 14 నుంచి 18 ఏళ్ల వయస్సున్న 100 మందిలో 50 మంది గడియారంలో ముళ్లు చూసి సమయం చెప్పలేకపోతున్నారన్నారు. తొమ్మిదో తరగతి చదివే వందమందిలో 40 మందికి రెండంకెల తీసివేతలు, 60 మందిలో మూడంకెల భాగాహారాలు రావు. ఇంటర్ పిల్లలకు ఇంటి వైశాల్యం ఎలా చూడాలో తెలీదు.. అన్నారు. సమాజంలో చదువుకున్నవారికి కూడా ఇతరులతో ఎలా ప్రవర్తించాలో తెలియడంలేదు. మనం చేస్తున్న చర్యల వల్ల పక్కవారు బాధపడతారన్న సోయి లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక విలువలు లేని విద్యతో సమాజంలో ఎలా మెలగాలో తెలియని విద్యార్థులు చిన్న సంఘటనలను జీర్ణించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచుతూ విద్యను బోధించాలని, అభ్యసనాన్ని బేరీజు వేయాలని, సమాజానికి ఉపయోగపడుతూ ఉపాధిని పొందే శక్తిని అందించాలని అన్నారు.

కనీసం ప్రాథమిక విద్య వరకైనా ఏ రకమైన ఒత్తిడి లేకుండా చదువులు ఉండాలని, విద్యార్థి ఎదుగుదలకు పునాది అయిన పాఠశాల విద్యను పటిష్టం చేయాలని జేపీ అన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డా॥ సి. వీరేందర్ మాట్లాడారు.

ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ డా॥ దేశినేని వెంకటేశ్వరరావు రాసిన 'పిల్లలపై చదువుల భారాన్ని తగ్గించడం ఎలా' పుస్తకం, 'సైకాలజిస్ట్ ఆన్ వీల్' అనే గోడపత్రికను అతిథులతో కలిసి జేపీ ఆవిష్కరించారు. సమావేశంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ అఫిలియేషన్ కన్వీనర్ డా॥ జీఎస్ పరంజ్యోతి, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకటరెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ సాదుల, ఉమామహేశ్వర్, నిరంజన్, జనార్ధన్, సయ్యద్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

Posting Date 07-04-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on April 1st 2019




"ఒక విధానాన్ని దాని వెనుక ఉన్న ఉద్దేశాల్ని బట్టి ఎప్పుడూ అంచనా వేయవద్దు.. దానివల్ల జరిగే పర్యవసానాలను బట్టే విధానాన్ని బేరీజు వేయాలి".

- 'అభివృద్ధి రాజకీయాల'పై విద్యార్థులతో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డా॥ జేపీ

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad